వ్యవస్థాపకులు
**కీ||శే|| మునుగంటి శ్రీరామమూర్తి**
గౌరవ సంపాదకులు
**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**
సంపాదకుడు
**మునుగంటి వెంకట్రావు**

61వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 61 మార్చి, ఏప్రిల్ - 2023 సంచిక - 9, 10








61వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721



సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ


**సంపుటి - 62** **మార్చి, ఏప్రిల్ - 2023** **సంచిక - 9, 10**


**సంపాదకవర్గం :**

శ్రీ ఆకెళ్ల మల్లికార్జునశర్మ
శ్రీ మల్లాది సూరిబాబు
శ్రీ పి.వి.ఎస్. శేషయ్యశాస్త్రి
డా॥ శ్రీమతి ద్వారం వి.జె.లక్ష్మి
డా॥ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం
డా॥ ఎమ్. పురుషోత్తమాచార్య
శ్రీ కె.ఎస్.ఆర్. బాలకృష్ణ శాస్త్రి
శ్రీ జొన్నలగడ్డ సూర్య ఈశ్వర ప్రసాద్
శ్రీ విష్ణుభట్ల శ్రీరామ చంద్రమూర్తి
విజయనగరం కుమారి డి. వర్ధని
డా॥ ఆర్. మాధురి దేవి
శ్రీమతి బురిడి అనూరాధ పరుశురాం
శ్రీ ఎమ్. వి. సింహాచల శాస్త్రి భాగవతార్
శ్రీ ఇ.వి.కృష్ణమాచార్యులు

**సారధ్య సంఘం :**

శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్
శ్రీ ఎన్.వి. రమణ
శ్రీ బి. మారుతీ రఘురామ్
శ్రీ ఎమ్. అచ్యుత రామయ్య
డా॥ శ్రీమతి టి. సూర్యకాంతం
శ్రీమతి నూలి వెంకట లక్ష్మిదేవి, M.A.,M.A.,M.A.
శ్రీమతి వై. రమాప్రభ, M.A., (Music)
శ్రీమతి ఎస్. సుబ్బలక్ష్మి, M.A.,M.A.,M.A. (Music)
శ్రీమతి పి. రమాదేవి, హనుమకొండ
శ్రీమతి ప్రభల రాజేశ్వరి
శ్రీమతి ఎ. భారతీదేవి, గుంటూరు
శ్రీమతి ఎమ్.వై. శేషురాణి, గుంటూరు
కుమారి మండపాక నాగలక్ష్మి


## ఈ సంచికలో....


| | | | పేజీలలో |
|---|---|---|---|
| 1. | గానయోగి.... వోలేటి | - శ్రీ మల్లాది సూరిబాబు | 3 |
| 2. | "సంకీర్తనోద్యాన విహారి" శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ | - శ్రీ కలగ కృష్ణమోహన్ | 9 |
| 3. | ముసునూరి వెంకటరమణ మూర్తి | - శ్రీ మోదుమూడి సుధాకర్ | 12 |
| 4. | మానము లేదా - అమీర్ కల్యాణి - త్యాగరాజ కృతి | - శ్రీ ఆలమూరు విజయభాస్కర్ | 14 |
| 5. | అన్నమయ్య పద యజ్ఞం | - 'నారద' | 16 |
| 7. | అమేయ ప్రతిభాసంపన్నుడు 'గాయకరత్న' శ్రీమహావాది వెంకటప్పయ్య శాస్త్రి | - శ్రీ డా॥ భూసురపల్లి వేంకటేశ్వర్లు. | 18 |
| 8. | మహిళా వాగ్గేయకారులు | - శ్రీ డా॥ శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి | 19 |
| 9. | ఆదర్శ గురువు - శ్రీ ఇవటూరి విజయేశ్వర రావు గారు | - శ్రీమతి డా॥ వి. గౌరీ రామ్మోహన్ | 21 |
| 10. | పుస్తక సమీక్ష - 'కర్నాటక సంగీత మార్గదర్శి' | - శ్రీ వింజమూరి వరదరాజ అయ్యంగార్ | 25 |
| 11. | సంగీత సభల కార్యకలాపములు | - 'విహారి' | 26 |


## ముఖచిత్రం


ప్రతిష్ఠాత్మక మైన కేంద్రసంగీతనాటక అకాడమీ అవార్డులను రాష్ట్రపతి గౌ॥శ్రీమతి ద్రౌపదిముర్ము చేతులమీదుగా అందుకొంటున్న శ్రీ పత్రి సతీష్ కుమార్; శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్; వేణుగాన విద్వన్మణి శ్రీమతి మాలాచంద్రశేఖర్; హరికథా భాగవతారిణి శ్రీమతి ఉమామహేశ్వరి.

రాష్ట్రపతి గౌ॥శ్రీమతి ద్రౌపదిముర్ము గారినుండి "పద్మశ్రీ" అవార్డు స్వీకరించిన ప్రఖ్యాత హరికథకులు శ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి భాగవతార్; సంఘసేవకులు, సంగీతపోషకులు డా॥సంకురాత్రి చంద్రశేఖర్(సంకురాత్రి మంజరీ సంగీత కళాశాల, కిరణ్ కంటి ఆసుపత్రి అధినేత, కాకినాడ)

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

# ఉభయ సంగీత ప్రవీణ - గానయోగి.... ఓలేటి

## (1927-1989)



- మల్లాది సూరిబాబు

తండ్రి : నరసింహారావు

తల్లి : అచ్చికాసులు

తండ్రికి సంగీతాభిరుచి వుండేది. కానీ నేర్చుకోవడం కుదరలేదు. వోలేటి శ్రీ చతుర్వేదుల అచ్యుత రామ శాస్త్రి వద్ద సంగీతాభ్యాసం ప్రారంభించి అలంకారాలు, గీతాలు నేర్చకున్నారు.

1935 లో కాకినాడలో మునుగంటి వెంకట్రావు పంతులు, నడిపే శ్రీరామ సమాజంలో ఉచిత భోజన వసతులతో ఎందరో శిష్యుల్ని తయారుచేశారు. వారిలో వోలేటి ఒకరు. ప్రముఖ వైణికులు ఈమని శంకరశాస్త్రి, ER కాలేజీలో వెంకట్రావు పంతులుగారి శిష్యులు. సీత అనసూయ, మొదలైన వారెందరో ఈ గురుకుల విద్యార్థులే.

పంతులుగారి, సంగీతబోధన చాలా క్రమశిక్షణతో బాటు యితర బాణీల పట్ల కూడా సదవగాహనతో ఉండేది. పంతులుగారు ఏ సంగీత శైలినీ నిరసించేవారు కాదు. ఈనేపథ్యం కారణంగా వోలేటి గారిలో హిందూస్తానీ సంగీత ప్రియత్వం, ఉత్తర హిందుస్తానీ సినీ సంగీతం పట్ల మక్కువ, లలిత సంగీత రీతులలో పాడటం వంటివి ఏర్పడ్డాయి.

ఒకొక్కసారి మన ప్రయత్నమంటూ లేకుండా కొన్ని కొన్ని సంఘటనలు జరిగిపోతూంటాయి. ఏదో అనుకుంటాం. చేసేద్దామనుకుంటూంటాం. మనం అనుకుంటే సరిపోదు. ఆ విధాత కూడా సంకల్పించాలి. అప్పుడు అన్ని పనులకూ కర్త, కర్మ, క్రియ అన్నీ తానై చూసుకుని మన ఆలోచనలకు ప్రయోజనాన్ని సిద్ధింపచేస్తాడు. కారణజన్ములైన యోగులు, వాగ్గేయ కారులూ విద్వాంసులూ, కళాకారులూ అలా జన్మించినవారే.

కిందటి శతాబ్దంలో యించుమించు నాలుగైదు దశాబ్దాలపాటు ఆంధ్రదేశానికి అత్యుత్తమ సంగీతమందించిన ప్రథమశ్రేణి విద్వాంసుడు వోలేటి వెంకటేశ్వర్లు. నేను రేడియో కేంద్రంలో ప్రవేశించటం మేరు శిఖరం లాంటి వోలేటి గారు నాకు ప్రత్యక్ష గురువవటం, కేవలం భగవత్ప్రేరణకాక మరేమిటి?

సంగీత శ్రవణం, పఠనం, మననం, సంగీతాధ్యయనం, సంగీత బోధనం, 'సంగీత' సృజనం, సంగీత సంప్రదాయ పరిరక్షణం, సంగీత ప్రసారం... వీటికోసమే జీవించిన విద్వాంసుడు వోలేటి.

విజయవాడ ఆకాశవాణి సంగీత విభాగపు మూలస్తంభాలలో ఆయన ఒకరు. సంగీత సాహిత్య సవ్యసాచి డా. బాలాంత్రపు రజనీకాంతరావు, 'సంగీత కళానిధి' డా. బాలమురళీకృష్ణ, శ్రీరంగం గోపాలరత్నంలతో కలిసి విజయవాడ ఆకాశవాణి కేంద్రం కీర్తి చంద్రికలను దశ దిశలా వ్యాపింపజేసిన వారిలో వోలేటి ఒకరు.

మిగిలిన వారు ఎక్కడెక్కడికో బదిలీ అయినా వోలేటి గారు మాత్రం తన జీవితాన్ని రేడియో సేవకే అంకితం చేసి చరితార్థుడయ్యారు. రేడియో కార్యక్రమాలు వినేశ్రోతలు ఈ రోజుకూ వోలేటి గారిని తలుచుకోకుండా ఉండరు. కారణం, ఆయన నిర్వహించిన అనేక సంగీత కార్యక్రమాలే.

ఆయన గానంతో శృతి శుద్ధతకు అత్యంత ప్రాధాన్యత కనిపించేది. నిజానికి ఆయనకు తంబురా శృతి సహకారం నామమాత్రమే. ఒక్కసారి గానం ప్రారంభిస్తే, మళ్ళీ మధ్యలో ఎక్కడా అనుమానం కలగదు, రాదు. కొన్ని దశాబ్దాల పాటు తంబురా శృతితో ఆయన ప్రక్కనే కూర్చుని సంగీతాధ్యయనం చేసిన నాకదో ప్రత్యక్షానుభవం. గోముఖం నుంచి గంగ వెలువడినట్లు ధారగా సాగిపోయేది ఆయనగానం.

1971వ సంవత్సరంలో తెలుగు రేడియో కేంద్రాల నుంచి వివిధ భారతి కార్యక్రమాలు ప్రారంభించిన సందర్భంగా కొత్తగా ఎనౌన్సర్ లను ఎంపిక చేశారు. వారిలో నేనొకడిని. నా అభిరుచికి తగ్గ ఉద్యోగం. సాధారణంగా మనుషుల వృత్తులకూ ప్రవృత్తులకూ పొంతన ఉండదు. సంగీత కుటుంబంలో పుట్టడం నా అదృష్టం. మానాన్న గారు కీ.శే. మల్లాది శ్రీరామమూర్తి గారు ''హరికధా పితామహుడైన ఆదిభట్ల నారాయణదాసుగారి హరికథలకు ప్రభావితుడై సంగీతాభిరుచిని పెంచుకుని, తనకు తానై గురువై దాసుగారి అంతేవాసులైన వాజపేయి యాజుల సుబ్బయ్యగారితో గల పరిచయంతో, (సుబ్బయ్యగారిదీ మాదీ స్వగ్రామం ప.గో. జిల్లా ఉంగుటూరు కావటంతో) కొన్ని హరికథలలోని కీర్తనలు పాఠం చేశారు. స్వయంగా తనసంగీత జ్ఞానం పెంచుకుని మా యింటిల్ల పాదికీ సంగీతం నేర్పారు. పాడించే వారు. సంగీత వాతావరణంలోనే పెరిగాను. నా ప్రవృత్తికి తగ్గ రేడియో ఉద్యోగం లభించి ఎనౌన్సర్ గా విజయవాడ రేడియో కేంద్రంలో ప్రవేశించాను.

1972 సంవత్సరం ప్రాంతంలో జరిగిన ఒక సన్నివేశం నన్ను వోలేటి గారికి సన్నిహితుణ్ణి చేసింది.

ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం చేసి వస్తూ వివిధ భారతి స్టూడియో వద్దకు వచ్చి ఆగి నాలుగు పాటలు విని మరీ వెళ్ళటం ఆయన అలవాటు. పైగా హిందీ, ఇంగ్లీషు సినిమాలు చూడటం ఆయనకు మహా యిష్టం.

''దేఖాహై తేరీ ఆంఖోఁమే ప్యార్ హి ప్యార్ బేషుమార్ పాయాహై తేరీ బాహోఁ మే ప్యార్ హిప్యార్'' మహ్మద్ రఫీ పాడిన ఈ పాటను బిగ్గరగా అనుసరించి పాడేస్తున్నాను. బయట డ్యూటీ రూమ్ లో కూర్చుని వింటున్న మా గురువు గారు (వోలేటి) పక్కన ఉన్న డ్యూటీ ఆఫీసర్ తో ఆ పాడుతున్నదెవరు? బాగ పాడుతున్నాడే అనగానే నా వివరాలన్నీ ఆ డ్యూటీ ఆఫీసర్ చెప్పాడు.

''అయితే ఆయన్ని నన్ను ఓసారి కలవమనండి'' అని చెప్పారు. మరునాడు ఉదయమే వెళ్ళి వోలేటి గారిని కలిశాను. ''మీ గొంతు నిన్న విన్నాను. బాగుంది. ఆ సినిమా పాటలు అనుకరించి పాడటం వల్ల ప్రయోజనం ఏముంది? ఆ, ఆసక్తి చక్కగా కర్ణాటక సంగీతంపై పెట్టండి'' అని సలహాయిచ్చారు. అయితే నాకు మార్గదర్శనం కూడా చేసి కాస్తపుణ్యం కట్టుకోమని అభ్యర్థించాను. ఏ మధురక్షణాల్లో ఆయన్ని కలిశానో, అలా ఆయనను కలవటమే నా సంగీత జీవితానికి ఒక మలుపు, రెండున్నర దశాబ్దాల పాటు ఆయనతో నా ప్రయాణం 35 ఏళ్ళపాటు ఎనౌన్సర్గా పనిచేస్తూ నా ప్రవృత్తికి తగ్గ సంగీతాన్ని క్రమేపీ వృద్ధి చేసుకుని వోలేటి గారికి ప్రీతి పాత్రమైన శిష్యుడిగా, లోకానికి తెలిశాను. మూర్తిత్రయం వారి అపురూపమైన మధ్యమ కాల కీర్తనలు, విలంబకాలకృతులూ, ముఖ్యంగా నవగ్రహ నవావరణ (దీక్షితార్), స్వాతితిరునాళ్, నవరాత్రి కృతులు నేర్చుకున్న భాగ్యశాలిని. వోలేటి గారికి అత్యంత అభిమాన పాత్రమైన కార్యక్రమం సంగీతశిక్షణ. కీర్తనలు ఎనలైజ్ చేస్తూ, అంటే క్లిష్టమైన స్వర సముదాయంతో ఏర్పడిన గమకాలను సింప్లిఫై చేసి, వివరించి పాడి బోధించటంతో ఆయనకు ఆయనేసాటి.

ఉదా :

సా ; ; రి స ని దా మ ప మ ని దా /పా దా ని ద

శ్రీ ర . . ఘ వ . . . ర ప్ర మే . .

పా దప

. . . . .

ప మ ద ప /ప మ మా గా ప మ మ గ గా పద

. . . య . . మా . . . . . మవ

Simplified Version

సా ; ; నీ దా మ ప మ ని దా పా దా పా మా

శ్రీ ర ఘ వ . . . ద ప్ర మే . యా

; గా , ప దా

మా మ వ

''విత్తొకటి పెట్టితేను, వేరొకటి మొలచునా'' అంటాడు అన్నమయ్య. ఓలేటి గారితో ఏర్పడ్డ పరిచయమే అనుబంధమైనాకు మార్గం చూపి, నన్ను విద్వాంసుణ్ణి చేసింది. నా పిల్లల సంగీత భవిష్యత్తును తీర్చిదిద్దేలా పునాదులు వేసింది. అంతేకాదు. డా. పినాకపాణి నేదునూరి

కృష్ణమూర్తి, వంటి ఉద్దండులైన విద్వాంసుల సాహచర్యం కూడా ఈయన కారణంగానే లభించింది.

ఇదంతా భగవత్సంకల్పం కాక మరేమి? నాకు లభించిన ఈ అదృష్టం ఏ విద్యార్థికీ లభించదు. వోలేటి గారి వ్యక్తిత్వం, సంగీతంతో పెనవేసుకున్న ఆయన జీవన సరళికి సంబంధించిన విషయాలు నాకు కరతలామలకమే! ఎప్పుడూ మననం చేసుకుంటూనే ఉంటాను. పాడటం నేర్పిన మొదటి గురువు నా తండ్రి శ్రీరామమూర్తి. తెలిసీ తెలియని వయస్సులో పలికిన ఆ చిలుక పలుకల వెనక ఎంత పరమార్థముందో ఏమి పాడాలో ఎలా పాడాలో సంగీతానికి గల పరిధిలేమిటో ఓలేటి, డా. పాణి, నేదునూరి, త్రయం గారల సాహచర్యంతో ఓఅవగాహనకు వచ్చింది. మంచి సంగీతానికుండే లక్షణాలు ఎలా ఉంటాయో గ్రహించే అవకాశం లభించింది.

రాగభావంతో నిండిన గమకపుష్టితో ఏర్పడిన కీర్తన పాఠాన్ని సొంతం చేసుకుని సాహిత్య భావాన్ని రాగమయం చేస్తూ మృదువుగా, సొగసుగా, శృతిశుద్ధంగా గానం చేయటం వోలేటి గారికి వెన్నతో పెట్టిన విద్య.

తన కచేరీలో మాధుర్యానికీ స్పష్టమైన ఉచ్చారణకు ప్రాధాన్యమిచ్చే వారు. పాండిత్యం కోసం గిమ్మిక్కులు చేయటం, శ్రోతలు, కరతాళ ధ్వనులకోసం వెంపర్లాడేలా పాడాలనీ ఉండేదికాదు. బుద్దునిలా కూర్చుని ప్రశాంత చిత్తంతో నాదమూర్తిలా భాసిల్లేవారు. ఏమాత్రం ఆడంబరా లెరుగని అసాధారణ ప్రజ్ఞా ప్రాభవం ఆయనది.

పాడడం ప్రారంభమైతే, యిక అటూ యిటూ చూసేదిలేదు. కచేరీకి ప్రముఖులెవరైనా వచ్చారాయనిగానీ ఫోటోగ్రాఫర్లు లేదా విలేఖరులు వచ్చారా లేదా యనే ఆలోచనే లేదు, ఆసక్తీ ఉండేది కాదు.

శృతి మాధుర్యంతో అర్ధనిమీలిత నేత్రాలతో తనలో తాను రమిస్తూ లీనమైపోతూ, తన పాటపైనే ఏకాగ్రత నిలిపేవారు.

చాలామంది విద్వాంసులలో కనబడే ఆభిజాత్యం, రవ్వంతైనా ఉండేది కాదు. కర్ణాటక సంగీతంలో లేని గొప్ప అంశాలు మరే ఇతర సంగీత ప్రక్రియలో కనిపించినా ప్రశంసించటానికీ, స్వీకరించటానికీ వెనకాడేవారు కాదు. శ్రీవోలేటి 1951 లో విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ఒక ఏడాది కాంట్రాక్ట్ పై పనిచేసే రోజుల్లో సంగీత శిక్షణ కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధగా చెప్పేవారు. దానికోసమే ఒక ఏడాది కాంట్రాక్ట్ యిచ్చారు. కొన్నేళ్ళ గ్యాప్ తర్వాత మళ్ళీ 1956 లో చేరి మూడు దశాబ్దాల పాటు కంటిన్యూ అయ్యారు.

శృతిశుద్ధత కు అర్థం. ఆయన పాట వారంలో రెండు సార్లు, ప్రతిబుధ, శుక్రవారాల్లో ఉదయం తెలుగు వార్తలయిన తర్వాత 7.15 నుండి 7.30 వరకూ సంగీత శిక్షణ ప్రసార మవుతూండేది. కాస్తముందుగానే స్టూడియోకు చేరుకుని తంబూర శృతి చేసి ఎదురు చూస్తూండే వాడిని.

ఆయన వస్తూనే కూర్చుని శృతి ఎంత పెట్టారు సార్ అనేవారు. తక్కువ శృతిలోనే సుఖంగా పాడటం ఆయనకు ఎంతో సౌకర్యంగా అనిపించేది. మీకు ఆశ్చర్యం గొలిపే విషయమొకటి చెప్తాను. భైరవి, కాంబోజి, తోడి వంటి రాగాల్లో బోధించవలసిన కీర్తనకు ముందు ఆయన గొంతు సవరించుకుని ఓ పది పదిహేను నిమిషాలసేపు మొత్తం హిందూస్థానీ ధోరణిలోనే శృతిశుద్ధమైన నాదంతో రాగ సంచారాలు చేస్తూ మధ్య మధ్యలో కొన్ని స్వరాలపై ఎక్కువసేపు స్థాయి నిలుపుతూ, పాడటం అలవాటు. అలా స్వరస్థానాలపై నిలకడగా స్థాయి నిలుపుతూ నాదప్రధానంగా సాగే శృతి శుద్ధతతో కూడిన ఆయన పాట ఎంతో సమ్మోహక్నంగా ఉండేది. అంతా హిందూస్థానీ సంగీత సంచారాలే తప్ప కర్ణాటక సంగీత ధోరణి కనపడేదికాదు.

15 ని.లకు 'సంగీత శిక్షణ' ఎనౌన్స్‌మెంట్ రాగానే వెంటనే ఆయా రాగాల్లోని కీర్తనలో పరకాయ ప్రవేశం చేసేసేవారు. దర్బారు, ధన్యాసి, తోడి యదుకుల కాంభోజి వంటి రాగాలకు ముందు హిందుస్తానీ బాణా సంచారాలు పాడటమే ఒక సాహసం. ఆయన అంతరంగమంతా హిందూస్తానీ సంగీతమయమే. వోలేటి భజనలు బాగా పాడతారాని అందరూ అనుకునే మాటే! దానికే పరిమితం కాదు. హిందూస్తానీ బాణిలో పాడే రాగ ధోరణిని కర్ణాటక సంగీతానికి అన్వయం చేయటం ఆయనలో కనిపించే విశేషం. అదే ఆయన ప్రతిభ.

ఇది మాత్రం అనన్య సాధారణం. కొందరు విద్వాంసులు (దక్షిణాదిలో) హిందూస్తానీ బాణీని దగ్గరకు రానివ్వరు. విని ఊరుకుంటారు. శుద్ధ సంప్రదాయంగా 'మడి' కట్టుకునే పాడాలనే చాందస వాదులున్నారు. సంప్రదాయం వదలి, విన్యాసాలు చేస్తే, లేచి వెళ్ళిపోవడానికి వెనుకాడరు.

వివిధ భారతి ధర్మమాయని నాకు ఉభయ సంగీత బాణీలపట్ల అభిరుచి ఏర్పడింది. నేను పెంచుకున్న హిందూస్తానీ రాగాలపట్ల నాకున్న ఆసక్తి వోలేటిగారితో సన్నిహితత్వాన్ని ద్విగుణీకృతం చేసింది.

బడేగులామాలీఖాన్ వోలేటి గారికి మానసిక గురువు. రేడియో ఉద్యోగంలో కుదురుకునే ముందు ఆయన కొన్నేళ్ళు మద్రాసులో ఉన్నారు. అప్పట్లో ఆలివర్ రోడ్లోని ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ యింటి ప్రక్కనే ఉంటూ సంగీత పాఠాలు చెబుతూ కాలక్షేపం చేశేవారు.

బడేగులాం మద్రాసు కచేరీలకు వచ్చినప్పుడు ప్రత్యక్షంగా కలిశారు కూడా. పహాడీ రాగంలో ఉస్తాద్ పాడిన హరి ఓం! అనే టుమ్రీ అప్పటికీ ఇప్పటికీ ఖాన్ సాహెబ్ ఎవర్గ్రీన్ హిట్. ఈ తుమ్రీ వోలేటిగారికి కంఠస్థం. 'గడచేనటే సఖియా' అనే దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి భావగీతాన్ని ఈ పహాడీలో ట్యూన్ చేసి ప్రసిద్ధం చేశారు. ఈ పహాడీపై మక్కువ అంతా యింతా కాదు.

ఓసారి మద్రాసులో లాల్ గుడి జయరామ్ గారింటికి వెళ్ళి కబుర్లు చెబుతూండగా, ఈ పహాడీ రాగ్ ప్రస్తావన వచ్చింది. ఓ తిల్లానా కంపోజ్ చేయమని అడిగారు లాల్ గుడి గారిని. అంతే అనతి కాలంలోనే కంపోజ్ చేసి (లాల్గుడి తిల్లానాలు LP ) హెచ్ఎంవి గ్రామఫోన్ రికార్డు కూడా యిచ్చారు. లాల్ గుడి కంపోజ్ చేసిన పహాడీ రాగం లోని తిల్లాన లో వోలేటి గారి హృదయం కనిపిస్తుంది, ఓసారి వింటే.

రేడియో కోసం వోలేటి గారు లలితగీతాలు కూడా పాడారు. మద్రాసు రేడియో కేంద్రంలో లైట్ మ్యూజిక్ యూనిట్ (LMU) ఉండేది. వయోలిన్, వీణ, వేణువు, క్లారియొనెట్ వంటి దేశీయ వాద్యాలతో 'వాద్య బృందం' ఏర్పడానికి కారణం డా. బాలాంత్రపు రజనీకాంతరావే.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు కార్యక్రమాలు కూడా ప్రసారమయ్యేవి. ఆ సమయంలోనే రజనీ గారి ప్రేరణతో ఏర్పడ్డ వాద్యబృందంతో ఘంటసాల, సుశీల, లీల, జానకి, మల్లిక్, యం.యస్. రామారావు, పిఠాపురం, ఎ.యం. రాజా వంటి ప్రముఖ గాయకులచేత పాడించారు. ఆకాశవాణి రికార్డులుగా విడుదలయాయి. వోలేటి, శ్రీరంగం గోపాలరత్నం పాటలెన్నో అలా రికార్డైనవే.

యిప్పటికీ కొన్ని రేడియో కేంద్రాల్లో ఆ టి.యస్. రికార్డ్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ తరుచు ప్రసారం చేయకపోవటం దురదృష్టం.

**వోలేటి గారి మనోధర్మంలోని విశేషం :**


సంగీతంలో ముఖ్యమైనది మనోధర్మం. రాగాలాపన, నెరవు, స్వరకల్పన ఈ మూడూ ప్రతీదీ కీర్తనను అనుసరించే ఉండాలి.

ఆధార షడ్జమైన శృతి యందు ఏయేస్వరములు ఏయే స్థానంలో పుట్టాయో దానిని దాటిపోక అన్నీ దానియందే అణిగి వుండటం శృతిలయం. ద్రుత, మధ్య విళంబకాలాల్లో దేనిని ఆశ్రయించి పాడతామో, దానిని వెనక్కూ, ముందుకూ ఈడ్వకుండా చివరిదాకా నిర్వహించటం తాళలయం.

సంఖ్యా మాత్ర ప్రధానమైన సంగీతంలో మృదంగం నోరు, పాటకుని నోరు, రెండూ సమానములే కదా? ఏ పాట పాడినా, దానికి చేతనైనన్ని ఆవర్తములు స్వరం వేసేసి ఏదో విధంగా చిందర వందరతో భీభత్సంగా పాడటమే ''ప్రజ్ఞ'' అనుకునే విద్వాంసులకంటే భిన్నంగా ఉండేది వోలేటి గారి శైలి. నామమాత్రంగా కీర్తన పాడుతూ తాళంపై కసరత్తులు చేస్తూ కీర్తన భావాన్ని మరుగున పడేసి కప్ప దాట్లతో పాడితే తాళ జ్ఞానం కలిగిన వాళ్ళకు కాస్త ఆనందం కలగ వచ్చునేమోగానీ, కీర్తన భావం తెలుసుకుందామని కూర్చున్న శ్రోతలకు అసహ్యభావం ఏర్పడుతుంది. ఆ సంగీతపు తుఫానులో నాదం నశించి, చెవులు దిమ్ముపట్టిస్తే ఆ సంగీతం రోతగా ఉంటుందని గాఢంగా నమ్మిన విద్వాంసుడు ఓలేటి.

ఆయన అభిమానులు అనుకునేమాట!

''ప్రతిభా బలం ధారాళముగా ప్రవహించేప్పుడు చిందర వందర విన్యాసాల'' అవసరం ఏముంది? దక్షిణాది రసికులు ఓలేటిగానాన్ని ప్రశంసించి చెప్పుకునేమాట అది.



## ఉభయ సంగీత ప్రవీణ :

విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి ఒక ప్రత్యేకత వుంది. సంగీత కార్యక్రమాల రూప కల్పనలో గానీ, సాహిత్య కార్యక్రమాలను ఎంపిక చేయడంలో గానీ, నాటక ప్రసారాల నాణ్యతలో గానీ, ఈ కేంద్రానిదే ఎప్పుడూ పైచేయి. ఒకప్పుడు బుచ్చిబాబు, బందా కనకలింగేశ్వరరావు, చివుకుల రామ్మోహనరావు, నండూరి సుబ్బారావు, సత్యం శంకరమంచి లాంటి అనుభవం పండిన వ్యక్తులు నాటకశాఖలోనూ, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి పింగళి లక్ష్మీకాంతం, జి.వి. కృష్ణారావు, 'ఉషశ్రీ' లాంటి పండితులు సాహిత్యశాఖలోనూ ఉండటంతో ఆకాశవాణికి ఎంతో పేరు ప్రఖ్యాతులు వచ్చాయనటంలో సందేహం లేదు.

సంగీతం విషయానికొస్తే శ్రీరంగం గోపాల రత్నం, వింజమూరి లక్ష్మి, కనకదుర్గ, మంగళం పల్లి బాలమురళీకృష్ణ, వోలేటి వంటి విద్వాంసులు ఈ కేంద్రానికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలు సంపాదించి పెట్టారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రాన్ని ఉన్నత శిఖరాలపై వుంచగలిగారు.

వోలేటిగారి సంగీత శిక్షణ కార్యక్రమాన్నే తీసుకుందాం – రసికుల సమక్షంలో కచేరీలు చేసి, డబ్బూ, ఖ్యాతీ సంపాదించాలనే కోరిక కంటే, ఈ 'సంగీత శిక్షణ' పట్లనే విపరీతమైన ఆసక్తిని ఓలేటి కనబరచేవారన్న విషయం చాలా మందికి తెలియదు.

సంగీత సాహిత్య కోవిదుడై ఆకాశవాణిలో లబ్ధ ప్రతిష్ఠుడైన రజనీకాంతరావు గారంటారు :

"పందొమ్మిది వందల నలభైలలో నేను మద్రాసు ఆకాశవాణిలో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ పాఠశాల కార్యక్రమాలు నిర్వహిస్తూండే రోజులలో మధ్యాహ్నం కార్యక్రమాలలో ఆ పట్టణపు ఉపాధ్యా యుల ప్రసంగం కాగానే 'ఇంక కొన్ని క్షణాలలో సంగీత శిక్షణ వింటారు' అని మదరాసు ఎనౌన్సర్ ప్రకటించాక– సంగీత శిక్షణ విజయవాడ నుంచి రిలేగా వస్తోంటే, ఆ రిలేలో మొదటిసారి వోలేటి కంఠస్వరం విన్నాను. మద్రాసు కేంద్రంలోని అప్పటి సహోద్యోగులు సంగీత శిక్షణలో ఉపోద్ఘాతము, సంగీత పాఠం చెబుతూ చెబుతూ మధ్యలో చేసే వాఖ్యలూ అచ్చం రజనీ గొంతులా వినిపిస్తున్నా యని అనేవారు. కంఠ స్వరంలో మా యిద్దరికీ సారూప్యత వుండేది. నిజజీవితంలో కూడా మా బంధం అంతటి గొప్పదే.

"సంగీత శిక్షణ కొన్నాళ్ళు చేశాక, విజయవాడ కేంద్రం నుంచి ఓలేటిగారి కంఠస్వరం వినబడటం ఆగిపోయింది. ఆయన మద్రాసు వచ్చేసి ఆలివర్ రోడ్లోని ముసిరి సుబ్రహ్మణ్య అయ్యర్ గారికీ, రంగరామానుజ అయ్యంగార్, వీణధనం మను మరాళ్ళైన బృంద, ముక్త, మనుమడు విశ్వనాథన్ మొదలైన వారికీ చేరువైనారు. మళ్ళీ కొంతకాలం విరామం తర్వాత 1956లో కర్ణాటక సంగీత ప్రయోక్తగా వోలేటి విజయవాడ ఆకాశవాణిలో చేరటం జరిగింది.

"భక్తిరంజని, సంగీత శిక్షణ, సంగీత రూప కాలూ, ఈ మాసపు పాటలూ – అదొక బంగారు కాలం. కూచిపూడి పునరుద్ధరణా, నవ్యయక్షగాన ప్రసారం లాంటివి మరచిపోలేం".

1956 సంవత్సరం నాటి మాట. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో సాహిత్య కార్యక్రమాల ప్రయోక్త పింగళి లక్ష్మీకాంతం గారూ, నాట రంగస్థల సూత్రధారుడు బందా కనకలింగేశ్వరరా గారూ, ఓలేటి గారూ కూచిపూడి యక్షగాన ప్రదర్శనల ఆదర్శ పరిణామాలకు కారకులు.

భామాకలాపం, గొల్లకలాపం, ప్రహ్లాద, శశిరేఖా

పరిణయం, సీతావనవాసం (లేక ఉత్తర రామాయణం) మొదలైన కూచిపూడి యక్షగాన రచనలను ఒక్కొక్క దానినీ తీసుకుని పింగళి లక్ష్మీ కాంతంగారూ, ఆయా నాటకాలలో, ఆయాపాత్రల వేషధారణలో ప్రామాణికత ఏర్పరుస్తూ మకుటాలూ, నరసింహస్వామి, నంది, ఇత్యాదుల శిరస్సులను తిరిగి నిర్మిస్తూ బందాగారూ, ఆయా నాటకాల దరువులలో వచ్చే రాగాలను, దరువుల లోని సంగీతాన్ని స్వరయుక్తంగా నిర్ణయిస్తూ ఓలేటి గారూ పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టారు.

'గంగాగౌరీ విలాసం' అనే తెలుగు యక్ష గానం, పిఠాపురంలో త్యాగరాజస్వామి సమకాలికుడైన మద్దిరాల వెంకటరాయకవి రచించిన 'ఏకాంత సేవా విలాసం' అనే యక్షగానాన్ని రూపొందించి జాతీయ కార్యక్రమంగా విజయవాడ. రేడియో కేంద్రం నుండి ప్రసారం చేశారు. దీనికి రూపశిల్పి ఓలేటి. కూచిపూడి యక్షగానాలు, ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, సదాశివహేంద్ర కీర్తనలలోను, హనుమాన్ చాలీసా, తరంగాలు, శంకరా' చార్యుల భజగోవింద శ్లోకాలతో భక్తి రంజని కార్యక్రమాలలోనూ ఓలేటి గారి కంఠస్వరం విజయవాడ ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితం. ఆయన నిర్వహిస్తూ వచ్చిన సంగీత పాఠాలలోని కీర్తనలు, అత్యంత ఉపయుక్తంగా వుండి, అప్పట్లో వెలువడే 'వాణి' పత్రికలో అచ్చవుతూ వుంటే శ్రోతలు, అ " కీర్తనల కోసం 'వాణి' పత్రికలు తెప్పించుకునేవారు. వాటిని బట్టి, ఆ పాఠాలను వల్లెవేసి వోలేటి గారి సంగీత శిక్షణ ద్వారా శిక్షితులైనవారం అని సగర్వంగా చెప్పుకునేవారు ఆంధ్రప్రదేశ్ లోనూ, యితర రాష్ట్రాల్లోనూ ఎందరో వుండేవారు. వారిలో కర్ణాటకులు, కేరళీయులు, తమిళులు కూడా వుండేవారు. వృత్తిరీత్యా ఎవౌన్సరైనా ప్రవృత్తి సంగీతం కావటం వల్ల ఆ కీర్తనలను, ఆయన ఎదురుగా కూర్చుని నేర్చుకునే అపురూపమైన అవకాశం నాకు దక్కినందుకు ఆనందపడుతూ వుంటాను.

కొన్ని దశాబ్దాలపాటు రేడియో సంగీత శిక్షణ ద్వారా ఎందరో సంగీత రసికులనూ, సంగీత విద్యార్థులనూ తనవైపు తిప్పుకున్న ఓలేటి గారి ప్రజ్ఞా ప్రాభవాలకు అసూయ చెందిన (విద్వాంసులైన) అధికారులే, ఆయనకు శత్రువులయ్యారంటే ఆశ్చర్యం కలగవచ్చు. కానీ అది నిజం. ఈ విషయం అస్మదాదులకు తప్ప వేరెవరికీ తెలియదు. ఆయన దీనికి తీవ్ర మనస్తాపం చెంది విజయవాడ కేంద్రంలో పనిచేస్తూ, ముందే రిటైర్ మెంట్ కోరుకున్నారు. ఆయనకున్న ఆత్మ గౌరవం అటువంటిది. ఆతర్వాత హైద్రాబాద్ పిల్లల వద్దకు వెళ్ళిపోయారు.

'శ్రుతిరూపం ఎలా వుంటుంది?' అని అడిగితే ఓలేటి గారిని ప్రథమంగా చెప్పవచ్చు. ఆయన గొంతులో సహజంగానే దేవుడు ఒక శ్రుతి బాక్స్ అమర్చి వుంటాడనిపిస్తుంది. ఆయన రాగాలా పనలో పరిమళించే స్వరాలన్నీ సుస్వరాలే.

పడుగు పేకల్లా అల్లుకుపోయిన అపారమైన స్వరజ్ఞానం ఆయన సొత్తు. ప్రక్క వాయిద్యాల ఊహకు అందనిరీతిలో వుండేవి ఆ సంచారాలు. భైరవి, కల్యాణి, రంజని, వరాళి, తోడి, కాంభోజి వంటి ఘనమైన రాగాలూ, బలహంస, నాయకి, రఘుప్రియ వంటి క్లిష్టమైన రాగాలూ, అసాధారణ మైన మనోధర్మంతో పాడుతోంటే వయొలిన్ విద్వాంసులు ఆశ్చర్యపోతూ విని ఆనంద సాగరంలో మునుగుతూండేవారు.

లాల్గుడి జయరామన్, ఎం.ఎస్. గోపాలకృష్ణన్ లాంటి ఉన్నతశ్రేణి విద్వాంసులు వోలేటిగారికి సహకారం అందించటంలో ఎంతో ఆసక్తి కనబరచే వారు.

చిత్ర విచిత్ర స్వర విన్యాసంతో, ఎవ్వరూ ఎదురుచూడని దారులు తొక్కుతూ శ్రోతల్ని తన్మయుల్ని చేసేవారు. అసాధారణ మనోధర్మంతో నిండిన ఆయన రాగాలాపనలో ఉభయసంగీతం బాణీల సొగసులన్నీ ఒక్కచోట గుదిగుచ్చినట్లు కనిపించేవి. ఇది ఆయన ఒక్కరికే సాధ్యం.


"తాను విన్న ఎంతటి క్లిష్టమైన పాటకైనా, ఆ పాట ఏ ప్రాంతానికి చెందినదైనా స్వరపరిచేసి, స్వాధీన పరుచుకుని, దానికి ప్రాణం పోసి, సొంతం చేసుకుని తనదైన ముద్రతో పాడతాడు" అంటారు డాక్టర్ శ్రీపాద పినాకపాణిగారు.

★ ★ ★

# "సంకీర్తనోద్యాన విహారి"
# శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్



కలగ కృష్ణమోహన్ [ గేయ రచయిత, స్వరకర్త ]
98495 98983



జీవితంలో ఇష్టపడిన దానికోసం మనసారా కష్టపడాలి. అలా ఇష్టపడినప్పుడే ఏ కష్టాన్నయినా భరించగలం. ఆపైన కష్టపడినప్పుడే మనకు ఇష్టమైనదాన్ని సాధించగలం. సంగీతమూ అంతే. సాధన చెయ్యాలి. సేవన చేయాలి. భావన చెయ్యాలి. శోధన చేయాలి. అప్పుడే, సంగీతకళాకారుడికి సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. అలా సిద్ధి పొందినవారే – ఒక ఘంటసాలగానో, సుశీలగానో, సాలూరి రాజేశ్వరరావు గానో, బాలసరస్వతీదేవిగానో, బాలమురళీగానో, ఓలేటిగానో, నేదునూరిగానో, చిత్తరంజన్ గానో, బాలకృష్ణ ప్రసాద్ గానో పరిణతి చెందిన సప్తస్వర వ్యక్తిత్వాలై సాక్షాత్కరిస్తారు. సంగీత ప్రియుల ఆరాధ్యదైవాలవుతారు.

జీవితంలో వెలుగు నీడల మధ్య .. ఆ సన్నని కాల్దారి మీద నడిచిన వ్యక్తి బాలకృష్ణ ప్రసాద్. వెన్నెల వేళలూ చూశాడు. చీకటి రేలనూ కడచాడు. ఆ దారిలో ఎదురైన అనేక అనుభవాలు అతని చూపుల్లో వినిపిస్తాయి. ఎన్నో అనుభూతులు అతని మాటల్లో కనిపిస్తాయి. ఆ అనుభవాల ఆనందాలూ .. అనుభూతుల పరిమళాలూ అతని 'పసి'నవ్వుల్లో దోగాడుతూంటాయి. అందుకే – బాలకృష్ణ ప్రసాద్ పాట వినడం ఒక అనుభవమే కాదు .. ఒక మనోహరమైన అనుభూతిలోకి మేల్కొనడం ... ఒక అద్వితీయ ఆధ్యాత్మిక సంగీత సభలో పాల్గొనడం.

సంగీత సాహిత్యాల పరిధులెరిగి రాగ సౌరభం చెడకుండా .. భావ సౌకుమార్యం పోకుండా స్వచ్ఛమైన, శుద్ధమైన ఉచ్చారణతో ప్రతి పదాన్నీ ఆ రాగ స్పర్శతో పాడే విశిష్ట శైలి తీరే – బాలకృష్ణ. ఆ రాగాల వనమాలి పేరే – బాలకృష్ణ.

రాగం తానై, భావం తానై .. లయలో సంచరించే నైపుణ్యంతో కూడిన ఏకాగ్రత తప్ప భావ సౌందర్యాన్ని మరుగునపరిచే అనవసర విన్యాసాలూ, మరే భేషజాలూ అతని పాటలో వినిపించవు. శబ్ద సౌందర్యం, స్వర సౌష్టవం తెలిసినవాడుగనకే – భావ సౌమ్యం అతనికి అలవడింది. సంగీత సౌకుమార్యాన్నీ, సాహిత్య సౌరభాన్నీ ఆత్మలో నింపుకొన్నాడుగనకే – సప్తస్వర వేదం అతని గొంతులో స్థిరపడింది.

సుతారం.. సుతిమెత్తన.. మార్దవం .. హాయి – అనే పదాలకు పర్యాయ పదమై .. తెలుగువారి అంతరంగాలలో ఆధ్యాత్మిక స్వర దీపాలు వెలిగించిన భావుకుడూ, నిత్య సాధకుడూ, ఆత్మ శోధకుడూ.. గాయకుడూ, వాగ్గేయకారుడూ.. మా గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్.

అన్నమయ్య సంకీర్తనా ప్రచార యజ్ఞంలో – వేటూరి ప్రభాకర శాస్త్రిగారూ, అలానే ఆ కీర్తనలను మొదట స్వరపరచి తెలుగువారికి సమర్పించిన రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారూ ప్రాతఃస్మరణీయులు. ఈ కోవలో మరెందరో విద్వాంసులు చిరస్మరణీయులు. ఈ వరుసలో బాలకృష్ణ ప్రసాద్ కి కూడా ఒక విశిష్ట స్థానం ఉందనడం అతిశయోక్తి కాదు. తన గురువుగారైన నేదునూరి బాణీలు కూడా బాలకృష్ణ కంఠంలో అందంగా, లలితంగా ఒదిగిపోయి అన్నమయ్య భావ చిత్రాలకు సజీవాకృతినిచ్చాయి. శాస్త్రీయ, లలిత, జానపద రీతుల్లో తాను స్వయంగా స్వరాలద్ది గానం చేసిన అన్నమాచార్యులవారి అనేక సంకీర్తనలు విశేష జనాదరణ పొంది.. ఇప్పటికీ అనేక వర్ధమాన గాయనీ గాయకుల పెదవులపై మసలుతూనే ఉన్నాయి.

అసలు అన్నమయ్యకూ.. బాలకృష్ణ ప్రసాదుకూ.. మట్టికీ, మనిషికీ – వానకూ, నేలకూ ఉన్న బాంధవ్యం ఏదో ఉందనిపిస్తుంది నాకు. చినుకు నేలను తాకగానే గుబాళించే మట్టి పరిమళం అందరికీ అనుభవైకవేద్యమే. తెలుగు నేలనుంచి వెలువడిన స్వచ్ఛమైన "స్వరరాగ సుధారస" మాధుర్యం యేదో ఆతని పాటలో ఎగసి .. వినగానే ఆ సొగసు మనసుల్ని ఆవరించుకుని.. వశపరుచుకొంటుంది. తండ్రి – చెయ్యి పట్టుకొని పిల్లాడిని బడికి నడిపించినట్లు ఈతని పాట మనసుల్ని ఆకట్టుకొని నా వంటి 'నాస్తికుడిలాంటి' వాడికి కూడా భగవంతునిపై ధ్యాస మళ్లించి, ఆధ్యాత్మికతవైపు అడుగులు వేయిస్తుంది.

దేవుడనే ఊహ – నమ్మినవారికి ఆలాపన .. నమ్మనివారికి ఆలోచన. ఉన్నాడనుకున్నవారికి ఈతని పాట – ఒక పథం అయితే .. లేదనుకున్నవారికి అదొక – పాఠం... సంగీత పాఠం. అంతే.

సంగీత సాహిత్యాలను ఉపాసించాడుగనకే ఆ రెంటి పరిధులూ తెలిసి సాగే అతని స్వర విన్యాసంలో విషయ పరిజ్ఞానం ప్రస్ఫుటంగా వెల్లడవుతుంది. నాద సాక్షాత్కారం కలిగిందిగనకే – అన్నమయ్యను అంతరంగ రంగంపై ప్రతిష్ఠించుకుని ఆ పదకవితా పితామహుని ఆంతర్యాన్నెరిగిన తన్మయత్వంతో పాడతాడు. తన పాటతో పరిసరాలనూ, శ్రోతల హృదయాలనూ సునాదమయం చేస్తాడు. అదీ అతని గానం సాధించిన పరమార్థం. అందుకే, అతని చేరువ సరస్వతి సన్నిధానం. అతనికి మాత్రం – "చిత్తజ గురుడు".. అన్నమయ్యే నిధీ, నిధానం. అందుకే అంటానూ – బాలకృష్ణ ప్రసాద్ అన్నమయ్య పదాలతో శ్రీపతి సన్నిధికి దారిచూపే సంగీత రాయబారీ ... అన్నమాచార్యులవారు అందించిన తిరువేదాన్ని సామాన్యులవరకూ చేరవేయడానికి దేశాటనం చేసిన ఆధ్యాత్మిక బాటసారీ ... అని. అన్నమయ్య సంకీర్తనలను – ఆరాధించి, పరిశీలించి, విశ్లేషించి దోషరహితంగా .. చందోబద్ధ న్యాయాన్ని పాటిస్తూ తన్మయుడై, చిన్మయుడై .. సాహిత్య భావాన్నిబట్టి లలితంగా, శాస్త్రీయంగా,జనరంజకంగా, మనోరంజకంగా, చిత్తరంజకంగా ఆలపించే గాత్రధారీ .. అన్నమయ్య పద సంకీర్తనలకు విస్తృత ప్రాచుర్యం కలిగించిన ముఖ్య పాత్రధారీ ... సూత్రధారీ – శ్రీమాన్ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్.

శబ్దానికి ఉన్న శక్తీ .. నిశ్శబ్దానికి ఉన్న పటిమా తెలుసుగనకే చిరునవ్వుతో భాషించడం అలవడింది. మాటలనూ, భాషనూ పొదుపుగా వాడుతూ నొసలు చిట్లించేవారికీ, చెవులుకొరికేవారికీ తన పాటతోనే జవాబు చెప్పే పాటవం అతనిది.

తాను నేర్చుకున్న సంగీతం మీదా, నేర్పిన గురువుల పట్లా అచంచల భక్తి కలిగిన సాధకుడు.. తన పెదవులపై రాగరంజితాలై కదిలే 'పదాల'పై ప్రగాఢ అనురక్తి కలిగిన శోధకుడు.. నాలాంటి ఎందరికో జ్ఞాన దానం చేసిన బోధకుడు.. చెదరని విశ్వాసంతో పరమాత్మను కొలిచే ఆస్తికుడు.. బాలకృష్ణ ప్రసాద్. తనకు జీవితాన్నీ, జీవనాన్నీ కరుణించిన సంగీత సాహిత్యాలపై విధేయతా, నడవడికలో నమ్రతా... ఆత్మ విమర్శ చేసుకోగలిగిన కుశాగ్ర బుద్ధీ, తాను చేపట్టిన అన్నమయ్య సారస్వత ప్రచార యజ్ఞం పై చిత్త శుద్ధీ కలిగిన నిత్య "అభ్యాస యోగి" – బాలకృష్ణ ప్రసాద్.

ఆత్మీయంగా పలకరించే చూపూ, కుశలం అడిగే చిర్నవ్వూ, అరమరికలులేని కలుపుగోలుతనం, మాటల్లో మెత్తదనం, నడకలో నిదానం, నడతలో పూర్ణత్వం, సుత్తిమెత్తని హాస్యం.. అతని ప్రత్యేకతలు.

1980 ల నాటి మాట. నాకు ఆకాశవాణి జాతీయ పురస్కారాలు వచ్చిన అన్ని సంగీత రూపకాల్లోనూ బాలకృష్ణ ప్రసాద్ ముఖ్య పాత్రధారి. అతను రికార్డింగులకు వచ్చినప్పుడు బెజవాడలో నా ఆకాశవాణి క్వార్టర్స్ లో – నా వంటతో సహా ఎన్నో విషయాలు చర్చకు వచ్చేవి. అయితే, ఏదో మాటల సందర్భంలో త్యాగరాజ ఆరాధకుడినైన నేను స్వామివారి సాహిత్యం, ప్రయోగాల గురించి మాట్లాడుతుంటే ..అన్నమాచార్యుల వారి సాహిత్య వైశిష్ట్యం గురించి సవివరంగా చెప్పి నన్ను అన్నమయ్యలోకి నడిపించిన మార్గదర్శి బాలకృష్ణప్రసాద్. నిజానికి అది – అన్నమయ్యలోంచి త్యాగయ్యలోకీ – త్యాగరాజస్వామి నుంచి అన్నమాచార్యులవారిలోకీ ఒక ఆధ్యాత్మిక సంగీత, సాహిత్య ప్రయాణం. నా వరకూ అది ఒక సంగీత, సాహిత్య అధ్యయనం. తెలుసుకున్నది ఎక్కువా.. ఆచరించినది తక్కువే అయినా ఆ రోజుల్లో బాలకృష్ణ ప్రసాదుతో గడిపిన అమృతతుల్యమైన ఘడియలు ఎవ్వరూ కొల్లగొట్టలేని నా ఆస్తి.

ఏదో ఒక రాగంలో పాడే పాటకూ.. రచయిత అంతరంగాన్ని శోధించి, సాహిత్యాత్మను ఆవిష్కరించే పాటకూ తేడా ఆ చర్చలవల్లా, అతని పాట వల్లా తెలిసింది. స్వర, రాగ జ్ఞానం – స్వరకర్తకూ, గాయకుడికీ కూడా యెందుకు అవసరమో అవగతమైంది. మోతాదు మించిన శాస్త్ర ప్రకర్ష కర్ణరంజకం, మనోరంజకం కాదనీ బోధపడింది. అలానే, ఈ సంగీత ప్రయాణంలో నా స్థానం, నా నడకా .. నేను ఎక్కడ తడబడుతున్నానో కూడా తెలిసివచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే – చూపు ప్రసరించడం వేరు .. దృష్టి సారించడం వేరు – అన్నది విశదమైంది.

గత నలభై ఏళ్లలో కొన్ని పురస్కారాలూ, మరికొసిని బిరుదులతో బాలకృష్ణ ప్రసాద్ పాటా, పేరూ తెలుగు రాష్ట్రాల్లోనే కాక ఇతర ప్రాంతాల్లో కూడా వ్యాపించి అతనికి మంచి గుర్తింపు వచ్చింది. ఈ “ఆమని సొబగుల పాట”ను ప్రేమించి “ “ఏమని పొగడుదుమే !”అనుకున్నవారెందరో.. అతని పాటనీ, పాడే విధానాన్నీ అనుసరించేవారూ, అనుకరించేవారూ మరెందరో.. శిష్యులూ, ప్రశిష్యులూ, గాయనీ గాయకులూ, అభిమానులూ అనేకం.. అయితే, గమనించాల్సింది ఏమిటంటే – ఈనాటికీ అతని అడుగు నేలమీదనే ఉంది.

“ఇలాగే పాడుతూ బతకాలని ఉంది అందుకే పుట్టాలీ .. మళ్ళీ మళ్ళీ” అని బాలకృష్ణ ప్రసాద్ వ్రాసిన లలిత గీతాన్ని శ్రీ పి వి సాయిబాబా స్వరపరచగా – 1974 లో అని జ్ఞాపకం – రవీంద్రభారతిలో తానే పాడాడు. అదేమోగానీ, అతని పాటలు వినడమే కాదు, అతనితో నా స్వర రచనలు పాడించిన నాకు – బాలకృష్ణ పాట వినడానికే “మళ్ళీ మళ్ళీ పుట్టాలి” అనిపించడం – కాస్త అతిశయోక్తిగా ధ్వనించే నిజం.

అసలు, నిజానికి మీరు చదివిందంతా ఉపోద్ఘాతం మాత్రమే. అతని పాట గురించీ, రచనల గురించీ ఇంకా.. వ్రాయాల్సిన విశ్లేషణలూ, చాలా.. చెప్పాల్సిన విషయాలూ ఉన్నాయి. సరే. ఇదే సరిగ్గా వ్రాయలేదేమో అన్న సంశయంతో కూడిన వెలితితో సతమతమవుతున్నా. అందుకే, ఇక ఇక్కడితో ఆపుతున్నా. తప్పదు మరి ! సంగీత నాటక అకాడమీ పురస్కారం ఆలస్యంగానైనా అందుకొంటున్న ఈ “అన్నమయ్య సంకీర్తనోద్యాన విహారికి” .. “తిరునగరి సంచారికి” జేజేలు ! జేజేలు ! జేజేలు !

**శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ - ప్రతిష్టాత్మక సంగీత నాటక అకాడమీ పురస్కారం 23-02-2023న అందుకొన్న సందర్భంగా....**

సుస్వరతరంగము

## సంగీత విద్వన్మణి

# ముసునూరి వెంకటరమణ మూర్తి

- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ



బెజవాడ రేడియోకి కీర్తిప్రతిష్ఠలను తెచ్చిన గాత్ర విద్వాంసులలో ముసునూరి వేంకట రమణమూర్తిగారు ఒకరు. పనిచేసినది సంగీత కళాశాలలోనైనా,రేడియోతో ఆయనకు అనుబంధం మెండు.రేడియో భక్తిరంజనిలో 'ఆదిత్య హృదయం' ఆయన గాన శైలికి చక్కని నిదర్శనం.ఎన్నో రేడియో యక్షగానాలలో సూత్రధారి పాత్ర ఆయనదే. ప్రముఖ హరికథకులు శ్రీ ముసునూరి సూర్యనారాయణ భాగవతార్ వీరి తండ్రి.

'గాయక సార్వభౌమ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి అనుంగు శిష్యులైన రమణమూర్తిగారు, చిన్నతనం నుండి గురువుగారి ఇంటనే ఉండి, సుశ్రూష చేసి, వారాలుచేసుకుంటూ ఎన్నో కష్టాలకోర్చి, సంగీతం అభ్యసించారు. పంతులుగారి దగ్గర ఎక్కువ పాఠాన్ని నేర్చుకోవటంచేత, గురువుగారి గాత్రశైలి పరిపూర్ణంగా అబ్బింది రమణమూర్తిగారికి. గురువుగారికి ఎన్నో కచేరీలకు గాత్ర సహకారం అందించారు.



బెజవాడ,విజయనగరం ప్రభుత్వ సంగీత కళాశాలలలో గాత్ర అధ్యాపకునిగా(1961-89)పనిచేసి, ఎంతో మందికి శిక్షణ ఇచ్చారు. కళాశాలలో రమణమూర్తిగారికి చండశాసనుడనే పేరు ఉండేది. విద్యార్థికి ఏకాగ్రత తగ్గితే క్షమించేవారుకాదు. అయితే ఇంటివద్ద ఎవరికీ పెద్దగా విద్య చెప్పిన దాఖలాలు లేవు. ఆయన మంచి స్వరకర్త కూడా. శ్రీమతి సరోజినీ నాయుడు రచించిన లలితగీతాలకు అద్భుతంగా సంగీతం సమకూర్చి,నాసోదరి శ్రీమహాలక్ష్మి బృందంతో రేడియోలో పాడించారాయన.టాప్ గ్రేడ్ విద్వాంసునిగా దేశవిదేశాలలో కచేరీలు చేసి, రసికులనలరించారు.

ఒకసారి,అనుకోకుండా రమణమూర్తిగారు, తన సహ అధ్యాపకులైన సంగీత విద్వాన్ పెమ్మరాజు సూర్యారావుగారితో కలసి,ఒక సందర్భంలో పాడటం జరిగింది.అదివిన్న శ్రోతలు,'మీఇరువురి గొంతులు బాగా కలిశాయి. ఇకనుండి ఇద్దరూ కలసి పాడమ'ని ప్రోత్సహించారు.సూర్యారావుగారు కూడా పారుపల్లివారి ప్రశిష్యులు కావటంచేత, వారిరువురి పాఠాలూ ఒకటిగా ఉండేవి. ఆనాటినుంచీ ఎన్నో యుగళ కచేరీలు చేశారు వారు. నిజానికి ఏనాడూ వారిరువురూ కలసి సాధన చేసినది లేదు.ప్రౌఢగంభీరమైన రమణమూర్తిగారి గాత్రం, లలితసుమధురమైన సూర్యారావుగారి గాత్రం కలసి, శ్రోతలకు జాజి మరువపు సువాసనలను పంచేవి.

రమణమూర్తిగారి కచేరీలు అనేకమార్లు విన్నాను. సుసాంప్రదాయ బద్ధమైన స్వచ్ఛమైన బాణి ఆయనది. పంతులుగారి ఎడల ఎంతో గురుభక్తి ఉన్నా, బయటికి ప్రదర్శించేవారు కారాయన. ప్రతి సంవత్సరం గురువుగారి వర్ధంతి ఉత్సవాలలో తప్పక పాడేవారు.యవ్వనంలో విలాసవంతమైన జీవితం గడిపారాయన. పసిడివన్నె చాయ ఆయనది.దానికితోడు, ఖరీదైన పట్టు పంచె, స్వర్ణాభరణాలు, నల్ల కళ్ళద్దాలు ధరించి,ఆయన నడచి వస్తుంటే,ఒక జమీందారు వలె ఉండేవారు.అత్తరు సువాసనలు పరిమళించేవి.

ఒకసారి బెజవాడ గాంధీనగర్లోని పంతులుగారి విగ్రహం దగ్గర గురుపూజ జరుగుతోంది.ఆనాడు ఆషాఢ శుద్ధ తదియ. పంతులుగారి తిథి.ఆనవాయితీప్రకారం మా గురువుగారు అన్నవరపు రామస్వామిగారితో శిష్య,ప్రశిష్యులందరం కలసి,ఉదయంపూట గురుపూజ నిర్వహిస్తున్నాము.ఇంతలో రమణమూర్తిగారు రిక్షాలో అటురావటం చూసి,గురుపూజకే వస్తున్నారనుకున్నారందరూ. అయితే,ఆయనకు ఆరోజు గురువుగారి తిథి అని జ్ఞాపకంలేక పోవటం చేత, ఏదోపనిమీద వెడుతూ, మాముందునుంచే రిక్షాలో సాగిపోయారు.అక్కడ ఎవరినీ చూడలేదాయన.

ఇది జరిగిన కొద్ది నెలలకు రమణమూర్తిగారి కంటి శుక్లాలకు శస్త్రచికిత్స జరిగింది. నల్లకళ్ళద్దాల స్థానంలో దళదరి అద్దాలొచ్చాయి. చూపు మందగించింది. ఇదివరకటిలా ప్రయాణాలు చేసి, కచేరీలు చేయలేక పోతున్నాననే మానసిక వ్యధ ఎక్కువయింది. క్రమేపి ఆరోగ్యం క్షీణించింది.మంచంపట్టారు.'అజ్ఞానంతో గురుపూజలో పాల్గొనలేకపోయాను.అందుకు మూల్యం చెల్లించుకుంటున్నాను' అని మాగురువుగారితో బాధపడ్డారాయన. చరమదశలో గురు,భగవన్నామస్మరణ చేస్తూ గడిపారాయన.

బయటికి ఎంతో గంభీరంగా కనపడినా,కడు సున్నిత మనస్కులాయన.ఉత్సవాలలో నా కచేరీ ఆసాంతం విని,అందరిలా పొగడక,నా అభ్యున్నతి కోరి సూచనలెన్నో చేసిన నిజమైన శ్రేయోభిలాషి.

తెలుగునాట అటువంటి మహా విద్వాంసులెందరో ఉన్నారు.అయితే మనం వారిని గుర్తించం,స్మరించం.. దక్షిణాది బాణీ అంటూ కొందరు తమిళుల సంగీతాన్ని అనుకరించి,ఆరాధించి,సాహిత్యాన్ని వధించి,అదే సంగీతమంటాం.

అయితే, మరో కోణంనుంచి చూస్తే, 'ఆంధ్ర బాణీ' ని ఎంతో గౌరవించే తమిళ, కన్నడ, మళయాళీ మిత్రులెందరో ఉన్నారు నాకు. ఇప్పటికీ మా బెజవాడ రేడియో కేంద్రానికి పనికట్టుకొని వచ్చి, 'రమణమూర్తిగారు, సూర్యారావుగారు పాడిన కచేరీలు, భక్తిరంజని రికార్డింగులు కావాలి' అని అడిగి తీసుకువెళ్లే రాష్ట్రేతరులూ, ప్రవాసభారతీయులూ నాకు తారసపడుతూ ఉంటారు.

# స్వరఝురి, బెజవాడ

మహా శివరాత్రి సందర్భంగా స్వరఝురి సంస్థ, బెజవాడ గవర్నరుపేట లోని చోడవరపు వారి వీధి రామాలయంలో 12గంటల నాదార్చన ఏర్పాటుచేసింది. నాదార్చన ఉదయం 9 గంటలకు ఆరంభమైంది. ఇందులో సర్వశ్రీ కె.వి.బ్రహ్మానందం, మోదు మూడి సుధాకర్, పోపూరి గౌరీనాథ్ కె.హిమబిందు, విష్ణుభట్ల సోదరీమణులు, అంజన సుధాకర్, పారుపల్లి సుబ్బరాయ ఫాల్గుణ్, పాలపర్తి నాగేశ్వరరావు, బి .వి .ఎస్.ప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు పాడిన అంశాలు : శివశివ యనరాదా, ఆనందనటన ప్రకాశం, నమశ్శివాయతే, నీరజక్షి కామాక్షి, సదా తవ పాద సన్నిధి.. మొదలైనవి.





# 'మానము లేదా' - అమీర్ కల్యాణి - త్యాగరాజ కృతి



- ఆలమూరు విజయభాస్కర్

**ఉపోద్ఘాతము:**

కావ్యములలో శబ్దము, అర్థము, భావము అను మూడు ప్రధానమైన అంశములు ఉంటాయి. వీటిలో శబ్దార్థములను కావ్య శరీరమనియూ, భావమును కావ్యాత్మ అనియూ నిర్వచించారు. ఈ కావ్యములు మూడు రకములుగా వర్గీకరించబడ్డాయి:

**1. చిత్రకావ్యము :**

దీనియందు వర్ణన (భగవంతునిదైనా లేక ప్రకృతిదైనా లేద ప్రియురాలిదైనా కావచ్చును) ప్రధానమైన అంశముగా ఉండును. త్యాగరాజరచనలైన "బాలకనకమయచేల", "జగదానందకారకా" వంటివాటిలో రాముని అద్భుతమైన వర్ణనలను మనము చూడగలము. అందుచేత వీటిని చిత్రకావ్యములుగా పేర్కొనవచ్చును. వీటిలో రమణీయమైన శబ్దసౌందర్యమును మనము చూడగలము. కావ్యముల శ్రేణిలో, చిత్రకావ్యములు సాధారణస్థాయి కావ్యములుగా పేర్కొనబడ్డాయి.

**2. గుణీభూతవ్యంగ్యకావ్యము :**

ఇట్టికావ్యములో కవి వర్ణనకంటే తన మనోభావప్రకటనకు ప్రాధాన్యమిచ్చును. ఈ భావముకూడ గుణీభూతవ్యంగ్యకావ్యములో స్పష్టముగా ప్రకటితమౌను. త్యాగరాజస్వామి వారి "రామ నన్ను బ్రోవరా", "తెలిసి రామచింతనతో" వంటి కృతులలో ఆయనహృదయభావము తేటతెల్లమౌను. వీటిని గుణీభూతవ్యంగ్యకావ్యములుగా పేర్కొనవచ్చును. వీటిలో మనోహరమైన అర్థసౌందర్యమును మనము చూడగలము. కావ్యముల శ్రేణిలో, గుణీభూతవ్యంగ్యకావ్యములు మధ్యమస్థాయి కావ్యములుగా పేర్కొనబడ్డాయి.

**3. ధ్వనికావ్యము :**

ఇట్టి కావ్యములో కవి తన మనోభావప్రకటనకు ప్రాధాన్యమిచ్చును. కాని ఈ భావము ధ్వనికావ్యములో వ్యంగ్యముగా ప్రకటితమౌను. త్యాగరాజస్వామి వ్రాసిన "మృదుభాషణా", "మానము లేదా", "మారవైరి రమణీ" వంటి కృతులలో ఆయన తన హృదయభావమును అనన్యసామాన్యమైనరీతిలో వ్యంగ్యముగా ధ్వనింపజేస్తారు. వీటిని ధ్వనికావ్యములుగా పేర్కొనవచ్చును. వీటిలోని వ్యంగ్యముగా సూచించబడిన భావము మనకు గోచరించినపుడు, ఒక విలక్షణమైన ఆనందానుభవమును మనము పొందగలము. కావ్యముల శ్రేణిలో, ధ్వనికావ్యములు ఉత్తమస్థాయి కావ్యములుగా పేర్కొనబడ్డాయి.

త్యాగరాజస్వామి రచించిన కృతులలో "మానము లేదా? తనవాడని అభిమానము లేదా?" అను కృతిని విశ్లేషించి, అందులోని ధ్వని సౌందర్యాన్ని ఆస్వాదిద్దాము.

పల్లవి॥ **మానము లేదా తనవాడని అభిమానము లేదా**

**॥మానము॥**

ఈ కృతిలో త్యాగరాజస్వామి ఎత్తుగడలోనే శ్రీరాముని "మానములేదా" అని ప్రశ్నిస్తారు. అంటే "రామా నీకు పౌరుషము లేదా?" అని నిలదీస్తారు. వెంటనే "తనవాడని అభిమానము లేదా?" అని అడుగుతారు. ఈ రెండు ప్రశ్నలవెనుక ఒక అద్భుతమైన అంతరార్థము ఉన్నది. దానిని మనము అనుపల్లవిలోనూ, చరణములోనూ చూడగలము.

అ. ప.॥ **కానమురా నీవలె నిర్మోహిని**

**గానరుచి తెలియు కుశలవజనకా ॥మానము॥**

త్యాగరాజస్వామి ఈ అనుపల్లవిలో ప్రయోగించిన "నిర్మోహి" అన్న పదము ఈ కృతికి, కృతిలోని త్యాగరాజ హృదయ భావమునకు మూలము.

భగవద్గీతలో దీనికి సంబంధించిన శ్లోకాన్ని పరిశీలిద్దాము:

**క్రోధాత్ భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః।**

**స్మృతిభ్రంశాత్ బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥**

అంటే క్రోధములోనుండి సమ్మోహము పుడుతుంది. దానినుండి స్మృతి విభ్రమము, తద్వారా బుద్ధినాశము, దానివలన మానవుని నాశనము కలుగును.

ఇచ్చట కోపము రాగానే సమ్మోహము కలుగుట సామాన్యమానవుల గుణము.

కానీ రాముని "నిర్మోహి" అని త్యాగరాజస్వామి సంబోధిస్తారు. అంటే ఎవరెంత కోపము తెప్పించిననూ, రామునికి ఆ సమ్మోహము కలుగదు. అందులోనూ, ఆ కోపము తెప్పించినవారు తనకు ఆప్తులైతే, వారిపై "తనవాడని అభిమానమే" చూపిస్తాడు రాముడు.

దీనికి ఉదాహరణగా ఇక్కడ త్యాగరాజస్వామి రాముని "కుశలవజనకా" అని సంబోధిస్తారు. ఈ "కుశలవజనకా" అన్న సంబోధన మనము త్యాగరాజ కృతులలో మరెక్కడా చూడము. దీని వెనుక ఒక అద్భుతమైన అర్థము ఉంది.

కుశలవులు మొదట తమగానముతో రాముని ప్రసన్నుని చేసుకుని, తరువాత రాముని అశ్వమేధయాగాశ్వమును బంధించి, రామునే ఎదిరిస్తారు. అలా ఎదిరించినా రామునికి వారిపై కోపము రాలేదు. సరికదా, వారికి తన మొత్తము "నరసామ్రాజ్యమును" ఇచ్చివేసెను. ఈ విధముగ నిర్మోహియైన రాముడు, తనను ఎదిరించినవారిపై కూడా "తనవాడని అభిమానమే" చూపించాడు.

**చ॥ నీ సముఖమున రవి తనయుడు నిన్ను బాసలు బల్కగా రోసముతో**
**సింహాసనాధిపతి జేసిన నీకు దాసుడైన త్యాగరాజ కరార్చిత**

**॥మానము॥**

ఈ చరణములో త్యాగరాజస్వామి రాముని "నిర్మోహి" అనుటకు మరొక ఉదాహరణ చూపిస్తారు.

సుగ్రీవునితో స్నేహముచేసినప్పుడు, వాలిని వధించి అతనిని రాజును చేసెదనని రాముడు వాగ్దానము చేసి, వాలిని యుద్ధమునకు పిలువమని సుగ్రీవుని ఆదేశిస్తాడు.

కానీ ఆ యుద్ధములో వాలిసుగ్రీవులమధ్య భేదము కనుగొనలేక, మొదటిసారి, వాలిని చంపడు. దెబ్బలుతినివచ్చిన సుగ్రీవుడు రోసముతో రాముని ఎన్నిమాటలనియుండవచ్చునో మనము ఊహించగలము.

కానీ, ఆ రోసపుమాటలకు కోపగించక, రాముడు సుగ్రీవుని "వానర సామ్రాజ్యమునకు" సింహాసనాధిపతి చేసెను. ఈ విధముగ నిర్మోహియైన రాముడు, తనను తిట్టినవారిపై కూడా "తనవాడని అభిమానమే" చూపించాడు

**త్యాగరాజ హృదయభావము:**

"రామా! నీవు నిన్ను వేడుకున్నవారిపైకాక, నిన్ను ఎదిరించినవారిపైనే అభిమానము చూపుచున్నావు. అలనాడు కుశలవులు నిన్ను సంగీతముతో మెప్పించిరి. పిదప నీతో యుద్ధము చేసిరి. కాని నీవు వారిపై అభిమానముతో "నరసామ్రాజ్యమును" వారికిచ్చితివి.

అట్లే సుగ్రీవుడు నిన్ను ఎన్నో మాటలనెను. కాని నీవు అతనిపై అభిమానముతో "వానరసామ్రాజ్యమును" అతనికిచ్చితివి.

నేనును కుశలవులవలె గాయకుడనే. నీవు "గానరుచి తెలిసినవాడవు". కావున నేనును నీవాడనే. నీ దాసుడను. నిన్ను తిట్టలేదు, పైగా నా కరములతో నిన్ను అర్చించుచున్నాను.

కానీ నాపై అభిమానము ఏల చూపవు?

ఓహో! నీవు నిన్ను ఎదిరించితేకానీ కరుణించవన్నమాట!!!

ఇప్పుడు నేనుకూడ నిన్ను అడుగుచున్నాను – "మానము లేదా" అని.

ఇదిగో నేను కూడ కుశలవులవలె, సుగ్రీవునివలె నిన్ను ఎదిరించి, తిట్టితినికదా..................


ఇప్పుడు నాపైకూడా అభిమానముచూపి, "రామభక్తి సామ్రాజ్యమును "నాకిమ్ము" అని త్యాగరాజ హృదయభావము....

ఇంత వ్యంగ్యముగా త్యాగరాజస్వామి రామునికి తనభావమును తెలుపుకుంటారు.

కావున ఈ కృతి త్యాగరాజహృదయధ్వనిని తెలుపు అద్భుతమైన ధ్వని కావ్యము అని నిస్సందేహముగా చెప్పవచ్చును.

★ ★ ★

# అన్నమయ్య పద యజ్ఞం




శ్రీమతి హిమబిందు పాలూరి & శ్రీమతి ప్రత్యూష శాస్త్రి గురజాడ. దుబాయ్ మరియు బెంగళూరు నివాసులు. గృహిణులు. సంగీతం నేర్చుకున్నారు. ఇరువురికీ అన్నమయ్య సంకీర్తనల మీద ఉన్న మక్కువతో, 2017 సంవత్సరం అన్నమయ్య జయంతి ని పురస్కరించుకొని "అన్నమయ్య పదయజ్ఞం " అనే మహా యజ్ఞం ప్రారంభించారు. ఇందులో 32 వేల మంది గాయకులు/ వాద్యకారులు పాల్గొనాలి అనేది వీరి ఆశ, ఆశయము. ఆ సంఖ్య విశిష్టత ఏమిటంటే అన్నమాచార్యులవారు అన్ని సంకీర్తనలు రాసినట్టు ప్రసిద్ధి. నేటి ఆధునిక పద్ధతులు ఉపయోగిస్తే వీరి లక్ష్యం సులువుగా చేరుకోవచ్చు, చిరస్థాయి గా నిలిచిపోతుంది అని అనిపించింది. అందుకే ఫేస్బుక్ లో "అన్నమయ్య పదయజ్ఞం " అనే పేరుతో ఒక పేజీ ని నిర్వహిస్తున్నారు.

ఈ పదయజ్ఞాన్ని మే 11, 2017 న పెద్దలు, గురువుల ఆశీర్వాదాలతో ప్రారంభించారు. ఇప్పటికి 2600కు పైగా పాటల వీడియోలు సేకరించ బడినాయి. ఇందులో 2700 మంది ఇప్పటి వరకు పాల్గొన్నారు.

నచ్చిన సంకీర్తనను శ్రుతి పెట్టుకొని లయ బద్ధంగా పాడుతూ, వీడియో గా రికార్డ్ చేసి, వీరికి మెయిల్ ద్వారా పంపితే, వాటికి సాహిత్యాన్ని జతచేర్చి, ఫేస్బుక్ పేజీలో, తదనంతరము యూట్యూబ్ ఛానెల్ లో పెడతారు. వీడియోలు పంపేటప్పుడు, వారిని పరిచయం చేస్కుంటూనే, వారి గురువుల పేర్లు, అన్నమయ్య పద యజ్ఞం అనే కార్యక్రమం కోసమని తప్పనిసరిగా చెప్పాలి.

annamayyapadayagnam@gmail.com

ఒకరు ఎన్నైనా సంకీర్తనలు పంపవచ్చు. కాకపోతే కాస్త కాలవ్యవధి ఇచ్చి వీడియోస్ ని అప్లోడ్ చేస్తారు.

అప్పటికే వేరే వారు పాడిన సంకీర్తనలు అయినా పాడవచ్చు. ఎలాంటి ఆంక్షలు లేవు.

కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో ప్రత్యేక కార్యక్రమాలను కూడా తీసుకుని వచ్చారు.

అందులో....

1. శ్రావణ సంకీర్తనం – శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రావణ మాస ప్రత్యేకతను వివరించే సంకీర్తనల సమాహారం.

2. శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవం – శ్రీ గంధం బసవశంకర రావు ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు వాడే స్వామివారి వాహనాల గురించిన వివరాల సమాహారం.

3. బ్రహ్మోత్సవ భక్తి సంకీర్తనం – ప్రముఖ గాయకులు బ్రహ్మోత్సవ సమయంలో అందించే అన్నమయ్య భక్తి సంకీర్తనలు.

"అన్నమయ్య సంకీర్తనవేదం"– శ్రీ గంధం బసవశంకర రావు ప్రతి ఆదివారం, ఒక సంకీర్తనను వివరిస్తూ ఇచ్చే వారాంతపు ధారావాహిక. అన్నమయ్య పదయజ్ఞంలో ఇది ఒక ప్రత్యేక భాగము. ఎంతో మంది విద్వాంసులు ఇందులో పాల్గొని ఇప్పటికి 280 సంకీర్తనల అర్థం మరియు సారాంశము అన్నమయ్య సంకీర్తన వేదం ద్వారా అందించినది సంగీతలోకానికి సమర్పించారు.

ప్రతి సంవత్సరము అన్నమాచార్యుని జయంతిని

పురస్కరించుకొని ఒక స్వరకర్త స్వరపరచిన సంకీర్తనలను గురువులతో, వారి శిష్యులతో పాడించటము జరుగుతోంది.

ఈ క్రమములో విదుషి కుమారి కన్యాకుమారి, విద్వాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ , విద్వాన్ నేదునూరి కృష్ణమూర్తి , విద్వాన్ శ్రీపాద పినాకపాణి గారలు స్వరపరచిన సంకీర్తనలతో జయంతి వేడుకలు జరుపుకొన్నారు.

ఔత్సాహిక గాయకులకు వారి ప్రతిభను నిరూపించుకునే ఒక వేదిక కల్పించేందుకు, అదే సమయంలో దైవాన్ని చేరే మార్గాన్ని తన కీర్తనల ద్వారా చూపిన అన్నమయ్యకు కళాకారులు నీరాజనాలు సమర్పించేందుకు,ఈ ప్రయత్నం ద్వారా అవకాశాన్ని కల్పించాలన్నది వీరి ఉద్దేశ్యం.

స్వామికి కైంకర్యముగా భావించి నిత్య సంకీర్తనార్చనగా రొజుకొక్క వీడియోని మాత్రమే అన్నమయ్య పద యజ్ఞం ఫేస్ బుక్ పేజీలో పెట్టడం జరుగుతోంది. ప్రతి సంకీర్తనను అందరు వీక్షించి, పాల్గొన్న వారికి ప్రశంసల తో పాటు, సంకీర్తనని ఆస్వాదించే అవకాశం అందరికి కలగాలని. అన్నమయ్య సంకీర్తన చిరస్థాయి గా నిలవాలని వీరి కోరిక.

ఈ పదయజ్ఞాన్ని వీరిరువురు నిర్వహిస్తున్నా, దీనికి పర్యవేక్షకులు, సాహిత్య పరంగా సూత్రధారిగా శ్రీ గంధం బసవశంకర రావు ఉన్నారు. మొదటి సంవత్సరములో చిన్నన్న రచించిన అన్నమయ్య జీవిత చరిత్రను విశ్లేషిస్తూ దాని పై క్లుప్తంగా వ్యాఖ్యానం అందించారు.

అలాగే ప్రతీ ఆదివారము “అన్నమయ్యసంకీర్తనవేదం”అనే శీర్షికలో ఒక సంకీర్తన అర్థపరమార్థాలు వివరిస్తారు.

ఈ యజ్ఞానికి పెద్దలు, గురువుల స్పందన విశేషంగా ఉంది. వారు పాల్గొనడమే కాకుండా వారి శిష్యులను కూడా ఇందు పాడడానికి ప్రోత్సహించడం ఆనందదాయకం. శ్రేయోభిలాషులు, ఆత్మీయులుగా ఉండడమే కాదు, ఇది వారి సంకల్పంగా భావించడం కార్యక్రమ నిర్వహణకు ధైర్యాన్ని కలిగిస్తున్నది అని తెలియజేశారు. ఎంతో మంది స్వరకర్తలు వారి బాణీలను ఇక్కడ స్వయంగా ప్రదర్శించడం హర్షణీయం.

ఫేస్బుక్ పేజీ, యూట్యూబ్ చానెల్ Please visit Facebook page at: https://www.facebook.com/Annamayya-Padayagnam-438401519842442/ Please subscribe to YouTube Channel: https://www.youtube.com/channel/UCP0eJeH4HH-Ge4EtvpwArclg

ఈ యజ్ఞంవల్ల అంతగా ప్రచారములో లేని మరియు సరికొత్త అన్నమయ్య కీర్తనలన్నీ వారి వారి స్థాయిల్నిబట్టి, ఎంచుకొని, నేర్చుకొని పాడి అన్నమయ్య పాటలన్నిటిని అందుబాటులోకి తేవాలని కోరుకుంటున్నారు.

ఇంటర్నెట్ ఈనాడు మారుమూల గ్రామాలకు కూడా చేరింది. దీని ద్వారా అన్నమయ్య కీర్తనలను, అవి పాడేవారిని ప్రపంచానికి పరిచయం చెయ్యాలన్నది సంకల్పం. ఈ బృహత్ యజ్ఞం పట్టణాలకు చేరడం ఒక ఎత్తైతే, మారుమూల గ్రామాల్లో చాలా అద్భుతమైన గొంతులు ఉంటున్నాయి, వారూ పాడితే బాగుంటుంది.

అలాగే ఎంతో మంది ప్రవాసాంధ్రులు, విదేశాలలో స్థిరపడ్డ తెలుగు వారు, సంగీతం అన్నా, అన్నమయ్య కీర్తనలన్నా మక్కువ ఉన్నవారు ఎంతో మంది ఉంటారు. కాకపోతే స్వదేశానికి దూరంగా ఉండడం వలన ఎక్కువగా అవి పాడుకునే అవకాశాలు దొరకవు. వాళ్ళందరు కూడా వీరి ఈ యజ్ఞంలో పాల్గొంటారని అలాగే ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమం గురించి పరిచయస్తులకు చెప్పడం, సోషల్ మీడియాలో షేర్ చెయ్యడం, వివిధ మాధ్యమాలలో ప్రచురించడం, దేవాలయాలలో ఈ విషయం గురించి ప్రచారం వంటివి చేస్తే, ఇంకా మరింత మందికి ఇందులో పాల్గొనే అవకాశం కలుగుతుంది. ఈ వేదిక ద్వారా మున్ముందు మరింత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలన్నదే వీరి కోరిక. ఆ దిశగా కృషి చేస్తున్నారు.

వీరి ప్రయత్నం అన్ని విధాలా ఫలించాలని కోరుదాం!.

★ ★ ★

## అమేయ ప్రతిభాసంపన్నుడు 'గాయకరత్న'

# శ్రీమహావాది వెంకటప్పయ్య శాస్త్రి

- డా|| భూసురపల్లి వేంకటేశ్వర్లు.

నేను ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో అంటే 1969 ప్రాంతాల్లో తొలిసారిగా మహావాది వెంకటప్పయ్య శాస్త్రిగారిని చూశాను. ఒంగోలులో పాంచాలవరపు ప్రసాదరావు గారు ఒక్కరే కష్టపడి ప్రతి సంవత్సరం సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి ఉత్సవాలు చేసేవారు. అప్పుడప్పుడూ మానాన్నగారు ఆయన మిత్రులు ఒంగోలు వెళ్ళి కచ్చేరిలు విని వస్తుండేవారు. వారితో పాటు నేను కూడా వెళ్ళిన సందర్భాలున్నాయి. ఒకసారి ప్రసాదరావుగారు మాకాలేజికి చందాకోసం వచ్చారు. నేను వారిని గుర్తుపట్టి వెళ్ళి "సంతానం గారి కచేరి ఎప్పుడు?" అని అడిగాను. అంటే ఈ సంవత్సరం మహారాజపురం సంతానం కచేరి ఒంగోలు త్యాగరాజ ఉత్సవాల్లో ఉన్నదని మా యింట్లో అనుకుంటుంటే వినడంవల్ల ఆలా అడగ్గలిగాను. వెంటనే ఆయన దగ్గరకు పిలిచి "అచ్చంగా 'సంతానం' అని అన్నావంటే నువ్వెవరో సంగీత రంగానికి చెందినవాడివే!" అని కరపత్రం ఇచ్చి తప్పకుండా రమ్మని చెప్పి వెళ్ళారు.

ఆ ఆదివారం త్యాగరాజమందిరం దగ్గరికి వెళ్ళాను. నాగరాజు సుబ్బారావు అని ఒక తరంగ కాలక్షేపం చెయ్యడంలో సిద్ధహస్తులుండేవారు వారికి, అప్పయ్య శాస్త్రిగారికి ఆరోజు త్యాగరాజమందిరంలో సత్కారం జరుగుతోంది. సత్కారానికి ముందు సుబ్బారావుగారి తరంగ కాలక్షేపం జరిగింది. ఒంగోలు ప్రాంతంలో నారాయణతీర్థ తరంగ గానం ఒక యక్షగానంలా సాగుతుంది. ప్రతి చరణానికి భరతం ఎంతో మేళవింపబడి ఉంటుంది. స్వర ప్రస్తారంలో ముక్తాయులు మేళవించినట్లు వీరు సాహిత్యంలో ముక్తాయిలు మేళవించి పాడేస్తారు. కేవలం కూర్చొని గానం చేయడమేగాక నాగరాజు సుబ్బారావుగారు లేచి నాట్యం చేస్తూ తరంగాలు పాడేవారు. తరువాత అప్పయ్య శాస్త్రిగారి కచేరి జరిగింది. మృదంగం తిరుపతి రామానుజసూరి గారు వాయించారు. వయొలిన్ ఎవరో బాగా గుర్తులేదు. ఒక గంట కూడా జరగలేదు. ఆ కచేరి చూశాక శాస్త్రిగారి పట్ల నాకు ఏ అభిప్రాయం ఏర్పడలేదు.

అప్పటినుంచి మందిరంతో పరిచయం ఏర్పడడం, ప్రతి శనివారం అక్కడ తంజావూరి నుంచి వచ్చి ఒంగోల్లో నివసించిన పి.యస్. గణపతి సుందరం, అద్దంకి భుజంగరావు గార్లు కలసి త్యాగరాజ కీర్తనలు గానం చేస్తుండడం, నేను అప్పుడప్పుడూ కంజీరా వాయిస్తూ ఉండడం. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. ప్రసాదరావుగారు అప్పయ్య శాస్త్రిగార్ని మళ్ళీ పాడించాలని తరచూ అనుకుంటూ ఉండేవారు. ఉత్సవాల సందర్భం వచ్చేటప్పటికి అందరూ చేరి తలకొక మాట అనుకోవడంతో శాస్త్రిగారి కచేరీ పెట్టాలని, ప్రక్కవాద్యాలు గొప్పవారిని పిలవాలని నిర్ణయం జరిగింది. చివరకు మద్రాసు ఆకాశవాణిలో పనిచేసే పి.శ్రీనివాసన్ గారి ద్వారా యమ్.యస్. గోపాలకృష్ణన్ గారి వయొలిన్, పాల్ఘాట్ మణి అయ్యర్ మృదంగం ఏర్పాటు చేశారు. ఒంగోలు ప్రాంతం అంతా ఒకటే గుసగుసలు. వారిద్దరితో శాస్త్రిగారు పాడగలరా అనేది అందరి సందేహం.

చివరకు ఆరోజు రానే వచ్చింది. శాస్త్రిగారి బలహీనత తెలిసిన ఆయన శిష్యుడు నేలభొట్ల ఆంజనేయశర్మగారు (ఒంగోలులో పేరు పొందిన న్యాయవాది) మూడురోజులు ముందుగానే తీసుకొచ్చి తనయింట్లో ఉంచేసుకున్నారు. ఆయన్ని చాలా వరకు తమ అధీనంలో ఉంచుకొని, పళ్ళు, టానిక్, ఇంజక్షన్ లు కూడా ఇచ్చారు. శాస్త్రిగారి చిరకాల మిత్రులు పువ్వుల సూరి బాబు గారు (ప్రసిద్ధ రంగస్థల సినిమా నటులు) మద్రాసు నుంచి, 'నాదబ్రహ్మ' చినపీరుసాహెబ్ (ప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు) ఇంకా తెనాలి నుంచి రామానుజసూరి గారు, చీరాల వేంకటేశ్వర్లుగారు, ఈమని రాఘవయ్యగారు, మానాన్నగారు ఇంకా ఎంతోమంది చేరారు. వీళ్ళంతా శాస్త్రిగారి అభిమానులు. అందరిలో ఒకటే ఆలోచన. శాస్త్రిగారు గొప్పగా పాడాలి. తెలుగు వాళ్ల పరువు పెరగాలి. అయితే అందరిలో శాస్త్రిగారి సంగీతం పట్ల ఒక నమ్మకం. ఆయన పాడగలడనే ఒక ధైర్యం.

తరువాయి 20వ పేజీలో...

# మహిళా వాగ్గేయకారులు

**డా|| శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

హైదరాబాద్

భారతీయ సంస్కృతికి తలమానికమైన శాస్త్రీయ సంగీతము ఒక అలౌకిక ఆనందమును కలుగచేసి, మనలను మైమరపించును అనుటలో సందేహము లేదు. మన సంగీతము ఆధ్యాత్మికతతో ముడిపడి యుండుట వలన చతుర్విధ పురుషార్థములు సాధించుటకు సులభోపాయమై యున్నది. సంగీతము జ్ఞానసముపార్జనకు ఒక చక్కని మార్గమని అందరూ అంగీకరించినదే. భగవదారాధనలో సంగీతము మనకు ఆయుధము, శక్తి వలె ఉపయోగించును. పాటల, కీర్తనల, రచయితలను 'వాగ్గేయకారులు' అందురు. మనకు ఎందరో వాగ్గేయకారులు ఉన్నప్పటికి, ప్రత్యేకించి మహిళా వాగ్గేయకారుల సంఖ్య చాలా తక్కువ. వారిలో చాలామంది స్త్రీలు ఆధ్యాత్మికత, మరియు సంగీతమును మేళవించి కీర్తనలు, రచనలు చేశారు. ధర్మార్థ, కామ, మోక్షములలో ఏదో ఒక దానిని స్ఫురించేలా ఉంటాయి వారి రచనలు.

### కొందరు మహిళా వాగ్గేయ కారులు

కాకుటూరు పద్మావతి, చందోలు శ్రీదేవి, ప్రఖ్య, సుగంధి కుంతలబాల, బుర్ర సూరమాంబ, పుట్టపర్తి కనకమ్మ, అన్నవరపు సీతాదేవి, మండపాక ఉమాదేవి, మల్లాది పద్మావతి తదితరులు.

## కాకుటూరి పద్మావతి

ఈమె మచిలీపట్నం వాస్తవ్యులైన మల్లవరపు వెంకట రమణయ్య గారి సుపుత్రిక. లంకా నరసింహశాస్త్రి గారి వద్ద సంస్కృతము, జొన్నలగడ్డ నారాయణశాస్త్రి గారి వద్ద తెలుగు మరియు పి.ఎమ్. చొక్కనాయకి అమ్మాళ్ వద్ద వీణ నేర్చుకున్నారు. చిన్నతనము నుండి రచనలు యందు ఆసక్తి ఉండుట చేత, వీరు 300లకు పైగా రచనలు చేశారు. వీరి కీర్తనలలో మచ్చుకు ఒక కృతి.

**క్షీరసాగర - రాగం సురటి - ఆది తాళం**

ప॥ క్షీరసాగర రాజనందిని
శ్రీరమామణి రవతు మాం ॥

అ.ప॥ మహాజననీ, మృణాళినీ
మధుర మంజుల భాషిణీ అంబా ॥

చ॥ విష్ణుచిత్త వికాసిని, వైకుంఠ –
వైకుంఠ నగరవాసిని – భక్త
విజయకారిణి – విశ్వమోహిని
పద్మగాన ప్రమోదిని
వైకుంఠనగర నివాసిని ॥

ఇది సంబోధనా పరమైన కృతి. లక్ష్మీదేవి పాలసముద్ర మధనమందు జన్మించినది. ఆమె మృదుభాషిణి అయిన దేవి. భగవంతుని హృదయరాణియై, ఆయన స్థానమైన వైకుంఠములో నివశిస్తుంది. ఆమె భక్త సులభురాలై, వారిని అనుగ్రహిస్తుంది. ఈమె కమలము నుండి ఉద్భవించి భక్తులను తన గానముతో పరవశింప చేస్తుంది.

## మల్లాది పద్మావతి

ఈ సంఘసేవిక ధారా సంజీవమ్మ, నరసింహశాస్త్రిగార్ల పుణ్యదంపతు లకు 20-10-1929 తేదీన జన్మించింది. ఆధ్యాత్మిక మార్గమును ఎంచుకున్నారు. ఈమె పట్టభద్రురాలైన తరువాత, వివిధ ప్రభుత్వ శాఖలలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పాఠశాల విద్యాశాఖలో డిప్యూటి ఇన్స్పెక్టరు (Deputy Inspector)గా బాధ్యతలు నిర్వహించారు. అప్పుడే ఆమె తన ఆత్మతృప్తికై పాటలు రాయటం మొదలు పెట్టారు. విద్యావంతులు ప్రోత్సహించారు. టిటిడి వారి ఆర్థిక సహకారంతో రెండు సంపుటాలు ప్రచురించినా, మిగతావి ఆమె స్వతంత్రంగా ప్రచురించారు. వీరు తెలుగు, సంస్కృత భాషలలో రచనలు చేశారు. వారి పాటలు, ఎక్కువగా ఆధ్యాత్మిక భావాలు, భగవంతుని గుణగణాలేకాక, సామాజిక పరంగానూ ఉంటాయి. సహజ ఆవేశాలతో, కొన్ని సందర్భాలలో సంప్రదాయ రచనా పద్ధతులను కూడా పక్కన పెట్టారు. ఆమె పదాలలోని భావం, అలౌకికానందాన్ని కలుగజేస్తూ సద్గురు త్యాగరాజుగారి భావావేశాన్ని తలపింప చేస్తుంది. తాము స్వయంగా పాడగలిగినా, తన ముందు ఇతరులు తన రచనలు గానం చేస్తుంటే, భావావేశంలో పరవశించేవారు. కాంభోజి రాగం ఆదితాళంలో నేను పాడిన ఈ కృతిని పరికించండి.

## కలనైనను — కాంభోజిరాగం - ఆదితాళం

ప॥ **కలనైనను కనపడవా, స్వామి**
**కలవరపడుచుంటిని, కరుణాసింధు ॥**

అ.ప॥ **అల్లరి చిల్లరిగా తిరుగమోదమా?**
**అకళంక గుణుని కొలువమోదమా ?**

నేను తపనతో నీకై తపించుచుంటిని స్వామి నాకు కలనైనా కనపడవా? అంటూ తనదైన శైలిలో అనుక్షణం ఆ వేంకటరమణుని తలుస్తూ 18-11-2012న హైదరాబాదులో పరమపదించారు.

మరియొక కీర్తనలో

ప॥ **మోహములో చిక్కుకొనుట, మోదమా?**
**ముకుందుని పూజించుట మోదమా?॥**

అ.ప॥ **అల్లరి చిల్లరిగా తిరుగ మోదమా?**
**అకళంక గుణుని కొల్వ మోదమా? ॥**

చ॥ 1) **లేనిచోట్ల కలతలు మోదమా?**
**కలియుగవరదుని కొలుచుట మోదమా?**

2) **భగవంతుని మరచి ఆగడము మోదమా?**
**ముకుందుని కొలుచు మోక్షము మోదమా?**

3) **కోట్లని ఎంచి సతిని మోసగించ మోదమా?**
**కొండలరాయని అండ మోదమా?**

4) **దుర్జనుచెంత దురితము మోదమా?**
**సజ్జను సంగతి సత్యము మోదమా?**

5) **పరిపరివిధముల పాపము మోదమా?**
**పరమాత్మపాదము కొల్వ మోదమా ?**

మనసా ! నా సందేహము నివృత్తి చేయుము. ప్రాపంచిక సుఖములలో తేలియాడుచూ, భౌతిక సుఖములకై ప్రాకులాడుటా ? లేక భగవంతుని లీలలు కీర్తించుటా? గమ్యము లేక తిరుగుట ముఖ్యమా? లేక శ్రీ వేంకటేశుని కొలుచుటయా? ఈ రకంగా ఎన్నో ప్రశ్నలను మన విచక్షణకు వదలివేశారు.

శ్రీ గాయిత్రి మహిళా సంగీత సన్మండలి వారి సౌజన్యంతో..

---

18వ పేజి తరువాయి........

ఆరోజు ఉదయం ఆంజనేయశర్మగారి యింట్లో శాస్త్రి అభిమానులందరికీ టిఫెన్లు వడ్డించారు. అందరిమధ్యలో శాస్త్రిగారు. ఉండీ ఉండలేక మానాన్నగారు "ఏంజేస్తాం! ఇదంతా మన బాధ! ఈయన సరీగా ఉంటే ఎదురు నిలిచేవాళ్ళు కనిపిస్తారా?" అంటూ ఆయన పట్ల నిష్టురంగా మాట్లాడుతూనే కన్నీరుపెట్టుకున్నాడు. ఒక్కనిమిషం అంతా మౌనం. అప్పయ్యశాస్త్రిగారు మానాన్న కన్నీళ్ళు చూసి చలించాడు. "ఒరేయ్! ఆదిశేషయ్య! నేను ఇప్పుడైనా పాడగలనో లేదో ఒకసారి వినరా!" అంటూనే తంబురా శ్రుతితీసుకొని (అప్పటికే శ్రుతి చేసిఉంది) 'కళ్యాణి' పాడారు. అద్భుతంగా పాడడం అంటే ఏమిటో అప్పుడే లీలగా తెలిసింది. చుట్టూ ఉన్న స్నేహితులే కాదు, ఆంజనేయ శర్మగారి కుటుంబసభ్యులు కూడా.. అందరూ కన్నీరు పెట్టారు. మానాన్నగారు శాస్త్రిగారిని కౌగిలించుకొని "ఈ రోజు కోసమే మేము జీవించి ఉన్నామనిపిస్తుంది" అన్నారు.

సాయంకాలమైంది. యమ్మెస్ గారు, మణి అయ్యర్ గారు వచ్చారు. "ఏదో పెద్దవాడు లాగా ఉంది. మనల్ని ప్రక్కన కూచో బెట్టుకొని చూసుకోవాలని వీరు ఆశపడ్డట్లున్నారు" అనే భావన వారిద్దరిలో కొట్టచ్చినట్లు కనిపిస్తుంది. కచేరీకి వెళ్ళబోతూ మందిరంలో శాస్త్రిగారు "నాయనా! పెద్దవాణ్ణయ్యాను మీరు బాగా సాధనతో ఉన్నారు". అంటుంటే వారినుంచి సమాధానంలేదు. వేదికనెక్కినాక భైరవి అటతాళవర్ణంతో కచేరి ప్రారంభించి అతి విలంబకాలంలోను ద్రుత కాలంలోనూ మధ్య మధ్య త్రిశ్రం చేస్తూ ప్రేక్షకుల్ని విద్వాంసుల్ని కూడా ఆశ్చర్య చకితుల్ని చేశారు. ఆరభిలో పంచరత్న కీర్తన పాడి సమయానికి తగు మాటలాడిన చరణం దగ్గర " తగు మాటలాడిన" చోటుకి 12 మాత్రల జాగాతో స్వరం పాడారు. అనంతరం మరి కొన్ని కీర్తనలు పాడి కల్యాణి రాగంలో "ఏతావునరా" కీర్తన పాడడం గొప్పగా ఉందని అందరూ చెప్పారు. తనిఆవృతం తరువాత కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి పుష్పవిలాపం రాగమాలికగా పాడారు. అది విని యమ్మెస్ గోపాలకృష్ణన్ మైకు తీసుకొని శాస్త్రిగారి గురించి చాలా గొప్పగా మాట్లాడారు. ఆ పోలికలో శాస్త్రిగారిని శెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ తో పోల్చి చెప్పడం ఒక విషయమైతే మీరు తమిళ నాట ఉంటే...." అని అర్థోక్తిగా అన్న మాటకు అందరూ సంతోషించి నిజమేనంటూ తలలూపారు.

ఆ తరువాత శాస్త్రిగారి మరో కచ్చేరికి కూడా దగ్గరున్న అనుభవం ఉంది. అది మరోసారి చెప్పుకుందాం. ఏమైనా ఆ మహానుభావుణ్ణి తలచుకోవడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాను.

శ్రీ గాయిత్రి మహిళా సంగీత సన్మండలి వారి సౌజన్యంతో..

# ఆదర్శ గురువు
# శ్రీ ఇవటూరి విజయేశ్వర రావు



- డా. వి. గౌరీ రామ్మోహన్



సంగీత కచేరి చేస్తున్న శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు

తంబూర సహకారం శ్రీమతి వి. గౌరీ రామమోహన్

శ్రీ ఇవటూరి విజయేశ్వర రావు గారు మే నెల 25, 1938 లో విశాఖపట్నంలో శ్రీ అక్కిరాజు, రాజేశ్వరమ్మలకు ప్రథమ పుత్రునిగా జన్మించేరు. 'ఏ పనికో జన్మించితినని నీ వెంచవలదు శ్రీరామచంద్రా! శ్రీపతి, నీ చిత్తానికి తెలియదా' అని త్యాగయ్యగారు అసావేరి రాగంలో పేర్కొనినట్లుగా, శ్రీ విజయేశ్వరరావు గారిని సంగీతానికి సేవ చేయడం కోసమే పుట్టించేడు భగవంతుడు. ఇందులో ఏ మాత్రము సందేహం లేదు. ఆ భగవంతుడికి వీరు సంగీతంలోనే జీవించుతూ, సంగీతమే సర్వస్వమూ కలగాలని సంకల్పమేమో! వీరు చిన్నప్పటి నుండీ రేడియోలో సంగీతం వింటూ, సంగీతంపై మక్కువ చూపడమే కాక, వినికిడి జ్ఞానంతో రేడియోలో విన్న సంగీతం చక్కగా పాడుతూండడం చూసిన వారి తండ్రిగారు విజయనగరంలోని మహా విద్వాంసులైన శ్రీద్వారం నరసింహ నాయుడు గారి వద్ద చేర్పించారు. ఏక సంతాగ్రాహులైన శ్రీ ఇవటూరి విజయేశ్వరరావుగారు అతిచిన్న వయస్సులోనే వైయొలిన్ మరియు గాత్రం అభ్యసించి, వారి తండ్రిగారు పరమపదించుటచే 15వ ఏటనుంచే సంగీత పాఠములు చెప్పడం ప్రారంభించి కుటుంబ బాధ్యతలని కూడా నిర్వర్తించేరు.

శ్రీ విజయేశ్వరరావు గారు వీరి గురువుగారైన శ్రీ ద్వారం నరసింహ నాయుడుగారి పేరు మీదుగా విజయ నగరంలో ఒక పాఠశాల స్థాపించేరు. ఈ నాటికీ అది నడుస్తున్నది. వీరికి గురుభక్తి అపారముగ నుండెడిది. ఎన్నో సందర్భాలలో వీరు వారి గురువుగారిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ శిష్యులతో వారి అనుభూతులను పంచుకోవడం జరిగేది.

తనదైన శైలిలో వాయులీన విద్వాంసునిగా, గాత్ర ప్రవీణులుగా, ఒక విశిష్టవ్యక్తిగా, ఉత్తమ గురువుగా నిల్చిన ఇవటూరి విజయేశ్వర రావుగారి గురించి ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తుంది.

మా గురువుగారైన శ్రీ ఇవటూరి విజయేశ్వర రావు గారి 86వ జన్మదిన సందర్భంగా నా అనుభవాలు, వారిని నేను తిరువయ్యారు త్యగరాజ సమాధి వద్ద కలసిన రీతి మీతో పంచుకోవాలనిపించింది.

1972, 73 సంవత్సర ప్రాంతంలో మేము వడపాతి మంగళం అనే చిన్న ఊరులో వుండేవాళ్ళం. అక్కడ మా నాన్నగారి ఉద్యోగం. అప్పుడు నేను మా అమ్మగారితో తిరువయ్యూరు వెళ్ళేను. కాలీకట్ లో ఉండే మా గురువుగారు అక్కడికి శ్రీ బాలసుబ్రహ్మణ్యశర్మ గారితో వచ్చేరు. వారిరువురికీ మమ్మల్ని పరిచయం చేసుకుని, "ఇప్పుడే మా అమ్మాయి ఇక్కడ పాడింది. మీరు వినే వుంటారు. మా అమ్మాయిని మీరు ఆశీర్వదించాలి" అని మా అమ్మగారు నా చేత నమస్కారం పెట్టించేరు, ఆ గొప్ప విద్వాంసులకి. "అయ్యో, మేం వినడం కుదరలేదు. ఇప్పుడే వస్తున్నాం, బయటకు వెళ్ళి" అని, "ఫర్వాలేదు మళ్ళా పాడించండి" అని త్యాగరాజస్వామి ఆలయం లోనే ఒక పక్కగా కూర్చుని, నన్ను పాడమన్నారు." ఏమినా భాగ్యం, త్యాగరాజస్వామి

సన్నిధిలో నా గానం! ఆ సన్నివేశం తల్చుకుంటే ఇప్పుడు నాకు 'నేనెంత అదృష్టవంతురాలిని' అని ఈ జన్మకిది చాలు అనిపిస్తుంది. ఆ ఇద్దరిలో ఒకరైన శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారి ముఖ్య శిష్యురాలనవుతానని ఆక్షణంలో నాకు తెలియదు. ''మంచి గురువు వద్ద సంగీతం నేర్పించండి'' అని నన్ను ఆశీర్వదించేరు. 1975 లో శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారు కాలికట్ రేడియో స్టేషన్ నించి విశాఖపట్నం రేడియో స్టేషన్ కు ట్రాన్స్‌ఫర్ అయి రావడం, అదే సమయానికి మా నాన్నగారు రిటైర్ అయి విశాఖపట్నం రావడం ఒకేసారి జరిగేయి.

సంగీత గురువుకోసం అన్వేషిస్తున్న మాకు శ్రీ తిరుపతి రామానుజసూరి గారి పరిచయం కలిగింది. వారు గొప్ప విద్వాంసులు. వారు మా యింటి దగ్గిరలో వుండేవారు. వారి దగ్గర నన్ను చేర్పించేరు మా అమ్మగారు. వారు కూడా రేడియో స్టేషన్ లో మ్యూజిక్ కంపోజర్ గా ఉద్యోగం చేసేవారు. ఇంటికి దగ్గరలోనే వున్నా టైమింగ్ కొంత కుదరక వారానికి ఒక్క రోజు, ఆదివారం వెళ్ళేదాన్ని. అదీ ఒక్క నెల రోజులే. ఇంతలో శ్రీ విజయేశ్వరరావుగారు కనిపించగా వారిని అడిగేను. ''మీరు సంగీతం నేర్పుతారా'' అని. అప్పుడు వారు, ''నువ్వు రామానుజసూరి గారి దగ్గరకు వెళ్తున్నావుకదా! వారి పర్మిషన్ తీసుకుంటే అప్పుడు నేను నేర్పుతాను.'' అంటే మళ్ళీ రామానుజ సూరిగారి వద్దకు వెళ్ళి అడిగి వారికి 'అభ్యంతరం లేదు' అంటే అప్పుడు విజయేశ్వరరావుగారి దగ్గరకు మళ్ళా వచ్చి, అడిగితే అప్పుడు ఒప్పుకున్నారు. దీనిని బట్టి వారు వారి స్నేహం పాడవకూడదు, మరియు ఒక గురువుని ఆశ్రయించాలంటే పాటించాల్సిన క్రమశిక్షణ, విలువలు నాకు అర్థమయ్యేయి.

ఆ రోజుల్లో మా గురువుగారికి ప్రథమ ఏకైక గాత్ర శిష్యురాలిని. వారు నేర్పిన సంగీతం, సంగీత విలువలు వాటికి కొలమానం లేదు. తెలిసీ తెలియని జ్ఞానంతో ఉన్న నాకు ఎంతో విపులంగా నా ప్రశ్నలన్నిటికీ ఎంతో ఔన్నత్యంతో సమాధానం ఇచ్చేవారు. ''ఈ లాగని వివరింపలేను చాలా స్వానుభవవేద్యమే'' అని త్యాగయ్యగారన్నట్లు ఆ అనుభవాన్ని మాటలలో చెప్పలేను.

ఒక కృతి నేర్పినప్పుడు ఆకృతిలోని సాహిత్యం, సంగతులలోని విశేషాలు, ఒకటేమిటి, ఒక్కొక్క కృతిని తీసుకుని ఒక్కొక్క పరిశోధనా పత్రంగా వ్రాయవచ్చనిపిస్తుంది. ఆ విశ్లేషణా జ్ఞానం తోనే నా పి.హెచ్ డి ని కొద్ది నెలలోనే పూర్తి చెయ్యగలిగాను. అది వారి భిక్ష, గురు కటాక్షం.

శ్రీ విజయేశ్వరరావు గారి వద్ద 1975 నుంచీ వారి తుది శ్వాస వరకూ వారి దగ్గరకు వెళ్ళి నేర్చుకోవడం, కొన్ని కచేరీలకు గురువుగారే వైలెన్ సహకారం వాయించడం, అనేక విషయాలలో నాకూ మా వారికి కూడా పెద్ద మనసుతో సలహా ఇవ్వడమే కాకుండా మాతో ఒక స్నేహపూరితమైన సంబంధంతో మెలగడం, మా అదృష్టం. వారి సతీమణి శ్రీమతి సూర్యకాంతం గారు మంచి ఆదర్శగృహిణి. వారి ఓర్పు, సహకారం గురించి ఇంతని చెప్పలేము.

నేను 1994 లో సంగీత విభాగం, ఆంధ్రయూనివర్సిటీ లో కో ఆర్డినేటర్ గా ఉండడాన్కి మా గురువు గారు శ్రీ విజయేశ్వరరావు గారు ముఖ్య కారకులని చెప్పాలి. ''సంగీతం తెల్సినవాళ్ళు, నీలాంటి వాళ్ళు హెడ్ గా వుంటేనే సంగీత విభాగాలకి న్యాయం జరుగుతుంద''ని నన్ను ప్రోత్సహించింది వారే.

నేను సంగీత విభాగానికి కో ఆర్డినేటర్ గా బాధ్యతలు తీసుకోవడానికి ముందు, శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారు ఆంధ్ర యూనివర్సిటి, సంగీత విభాగంలో సంగీతం క్లాస్ లో వుండడం, బయటనించి చూడడం తటస్తించేది. ఒకసారి వారితో అన్నాను, ''మీ క్లాస్ కి రావచ్చునాండీ. మీ క్లాస్ వినాలని ఉంటుంది నాకు''. వారు చిరునవ్వుతో ''ఓ అలాగే'' అనేవారు. అటువంటిది, వారు విజిటింగ్ ప్రొఫెసర్ గా మ్యూజిక్ డిపార్ట్ మెంట్, ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నప్పుడు అదే విభాగానికి హెడ్ గా వెళ్ళడంతో నా ఆనందానికి అవధులు లేవు. నేను బాధ్యత స్వీకరించిన కొద్ది రోజులకే ఒక రోజు వి.సి. గారు నన్ను పిలిచి, 'విజిటింగ్ ప్రొఫెసర్ ని మేము ఒక్క ఏడాది మాత్రమే అనుమతిస్తాం. ఇప్పుడు మీరు ఉన్నారు, ఇంకా ముగ్గురు డిపార్టుమెంట్ లో ఉన్నారు కదా' అనేసరికి నాకుఏం చెప్పాలో అర్థం కాలేదు. శ్రీ నేదునూరి కృష్ణమూర్తి గారి వంటి మహా విద్వాంసులున్న డిపార్టమెంట్ లో, వారి సంగీతం నేను కూడా వినచ్చు, నేర్చుకోవచ్చు, అన్న

ఆనందం క్షణంలో చప్పబడిపోయింది. అప్పటికే వారు ఐదు సంవత్సరాలు విజిటింగ్ ప్రొఫెసర్ గా వారి సేవని మ్యూజిక్ డిపార్టమెంట్ కి అందించేరు ఆ మరునాడు వి.సి. గార్ని కలిసి, సంగీతం అనేది అన్ని సబ్జక్ట్స్ లాంటిది కాదు. విజిటింగ్ ప్రొఫెసర్ తప్పనిసరిగా డిపార్టమెంట్ కి ఉండాలి అని నేను అభ్యర్ధిస్తే వారు 'ఇంకెవరినైనా మీరు రికమండ్ చెయ్యండి' అన్నారు. నాకు మా గురువుగారు వెంటనే మనస్సులో స్ఫురించేరు. నా ఆలోచన విసి గారికి చెప్పగానే 'అయితే లెటర్ పెట్టండి. పరిశీలిద్దాం' అన్నారు. వెంటనే మా గురువుగారింటికి వెళ్ళి వారి అనుమతి తీసుకుని, యూనివర్శిటికి రికమండ్ చెయ్యడం, నా లెటర్ని వెంటనే ఆమోదించడం, మా గురువుగార్ని విజిటింగ్ ప్రొఫెసర్ గా అపాయింట్ చెయ్యడం అన్నీ వరుసగా వెంట వెంటనే జరిగిపోయేయి. ఒకే ఒక్క సంవత్సరం మా గురువుగార్ని విజిటింగ్ ప్రొఫెసర్ గా నియమించేరు. మా గురువుగారు దానికే ఎంతో సంతోషించేరు. తరువాత, కొద్ది కాలం తరువాత, యూనివర్శిటీలో హానరరీ ప్రొఫెసర్ ని కొంతమందిని అపాయింట్ చెయ్యాలని నిర్ణయించి, సంగీత విభాగానికి శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారిని అపాయింట్ చేసేరు. కాని మా గురువుగారు ఎక్కువ తిరిగే పరిస్థితిలో లేరని తెలిసి, స్వయంగా, వైస్ ఛాన్సలర్ గారు, ఇతర ముఖ్యులు మా గురువుగారింటికి వచ్చి హానరరీ ప్రొఫెసర్ గా అపాయింట్ చేస్తున్న ఆర్డర్స్ ని స్వయంగా ఇంట్లోనే గురువుగారికి ఇచ్చి వెళ్ళేరు. ఆ సందర్భంలో మా గురువుగారు నన్ను తల్చుకుని, నా కారణంగా యూనివర్శిటిలో విజిటింగ్ ప్రొఫసర్ గా తదుపరి హానరరీ ప్రొఫెసర్ గా గుర్తింపు రావడానికి కారణమని అక్కడి విసి తదితరులతో చెప్పడం నా భాగ్యం.

మా గురువుగారు సంగీత విద్యకి ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో అంత విలువ జీవితంలో ఎలా మంచి క్యారక్టర్ తో జీవించాలో ఎన్నో సందర్భాలు మాకు తెలియచేసేవారు. "If wealth is lost nothing is lost. If health is lost something is lost. If character is lost everything lost". అలాగే న్యాయానికి కట్టుబడి ఉండేవారు. ఎంతో మంది టచ్ లో ఉంటారు. కాని మంచి గురువు దొరకడమనేది మన పూర్వకర్మఫలమనిపిస్తుంది. అందరూ గురువు కాలేరు. శ్రీ విజయేశ్వరరావు గారు వారు చెప్పేది వారు ఆచరించి చూపేవారు. సంగీత విద్యార్థులకు సాధన చాలా ముఖ్యం. వారు స్వయంగా ఎలా సాధన చేసేవారంటే, సూర్యోదయాన్కి ముందు త్రిస్థాయి సాధన. ఇది వేలల్లో వుండేది. కనీసం వెయ్యిసార్లు వాయించేవారు. తరువాత వర్ణాలు గంటకి తక్కువకాకుండా వాయించేవారు. తరువాత కృతులు... ఇలా పొద్దున్నంతా సాధన చేసేక, ప్రతినిత్యం సాయంత్రం సుమారు ఆరుగంటల నించీ కచేరీ పద్ధతిలో, వర్ణం, కృతులూ, రాగాలాపన స్వరకల్పన, ఇంకా చివరలో కచేరీలు ఎలాగయితే తిల్లాన జావళి, వగైరా వాయిస్తారో అవన్నీ వాయించేవారు.

అప్పట్లో రేడియో, ఆ తర్వాత టేప్ రికార్డర్లు మాత్రమే ఉండేవి. గ్రామఫోను కొందరిళ్ళలో ఉండేది. మా గురువు గారు ఎలా నేర్చుకునేవారోనని ఆశ్చర్యంగా అనిపిస్తూంటుంది. ఎన్నో అపురూపరాగాలు, సుప్రదీపం, పంచమ, ఇలా అనేక అరుదైన రాగాలలో కృతులు వారు విని నేర్చుకుని శిష్యులకు నేర్పేవారు. కొంతమంది కృతులు నేర్చుకోడం కోసం గురువుగారి దగ్గరకు వచ్చి నేర్చుకోడం, విజయనగరం లోనూ నాకు తెలిసి 75 తర్వాత విశాఖపట్నంలోనూ కూడా జరిగేది. నేను సమర్పించిన పి.హెచ్.డి థీసిస్ ఆద్యంతం విని కొన్ని సలహాలు కూడా ఇవ్వడం జరిగింది. అలాగే ఒకరిద్దరు వారి పి.హెచ్.డి కోసం, గురువుగారిని ఎన్నో విషయాలు అడిగి తెలుసుకొనేవారు. వారు చెప్పిన విషయాలు ఏ గ్రంథాలలోనూ దొరకవు. వారే ఒక గ్రంథాలయం.

గురువుగారికి శిష్యప్రేమ ఎక్కువ. వారు శిష్యులు ఏ విజయం సాధించినా ఎంతో ఆనందించేవారు. వారు ఇంట్లో సంగీతం నేర్పే సమయంలో కూడా ఏ శిష్యులైనా బాగా పాడినా వాయించినా వారి దగ్గరున్నది బహుమతిగా ఇచ్చేసేవారు. అలా ఇచ్చినపుడు గోప్యంగానే ఉంచమనేవారు. శిష్యులు బాగా నేర్చుకుని బాగా పాడినపుడు, వాయించినప్పుడు ఎలా మెచ్చుకుని ప్రోత్సహించేవారో అట్లే అంత క్రమశిక్షణ పాటించకపోయినా, లేదా కృతులలోని సంగతులను సరిగా పాడకపోయినా సహించేవారు కాదు. ఆయన ఒక Perfectionist అని చెప్పవచ్చు. అందుకే వారి శిష్యులు ఎక్కడ పాడినా బాగాపాడేవారు. అదీగాక,

ఇవటూరి విజయేశ్వరరావు గారి శిష్యులు ప్రశిష్యులు అనగానే వారు తప్పక బాగా పాడతారు అనే ముద్రపడిపోయేది. ముఖ్యంగా వారు సాయంత్రాలు కచేరీ పద్ధతిలో సాధన చేసేటప్పుడు శిష్యులని తంబురా వేయమనేవారు. వారి దగ్గిర నేర్చుకునే శిష్యులకు వైలెన్ వీణ వాయించడాన్కి అవకాశం ఇచ్చి వాయించమనేవారు. మృదంగం పై కూడా కొంతమంది క్రమం తప్పకుండా వచ్చి మృదంగం వాయించిన వారందరూ కూడా ఇప్పుడు గొప్ప మృదంగ విద్వాంసులుగా దేశ విదేశాల్లో రాణిస్తున్నారు.

గురువుగారు సాధన మానకుండా చేస్తూ, శిష్యులకు సంగీత బోధనను అంతే పటుత్వంతో నేర్పుతూ అనేక మంది శిష్యులను నిష్ణాతులుగా తీర్చి దిద్దారు. ఎంతోమంది శిష్యులు దేశ విదేశాల్లో మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అతి క్లిష్టమైన షట్కాల పల్లవిని శ్రీమతి మండ సుధారాణి చేత పాడించిన ఘనత శ్రీ విజయేశ్వరరావు గారిదే. వీరి ఆలోచనలు అన్నీ సంగీతాన్కి ఏ విధంగా రూపకల్పన చేస్తే భావితరం వారికి ఉపయోగపడతాయి అని దూరదృష్టితో, ఉండేవి. వీరి స్వస్థలమైన విజయనగరంలో వారి పిన్న వయసులోనే వారి గురువుగారి పేరుతో ''ద్వారం నరసింగనాయుడు సంగీత పాఠశాల''ని స్థాపించేరు. ఆ స్కూలు ఇప్పటికీ చక్కగా నిర్వహింపబడుతోంది.

శ్రీ విజయేశ్వరరావు గారు వారి స్వగృహంలో కొంత ధనం వెచ్చించి సంగీతాన్కి ఒక హాలు కట్టించి, అందులో ప్రతినెలా మొదటి ఆదివారం సాయంత్రం కచేరీ ఏర్పాటు చేసేవారు. మొదటి అరగంట ఒక చిన్న కచేరీ, తర్వాత రెండు గంటల కచేరీ, ఎక్కువగా వర్ధిష్ణు కళాకారులు, వారి శిష్యులు, పై ఊళ్ళ నించి వచ్చిన గొప్ప విద్వాంసుల కచేరీలు ఏర్పాటు చేసి మంచి సంగీత వాతావరణాన్ని నెలకొల్పుతూ ఉండేవారు. అట్టి సందర్భంలో శ్రీ ఓలేటి వెంకటేశ్వర్లు గారు వీరింట్లో కచేరీ చేసినప్పుడు తోడి రాగాన్ని ఎంతో విస్తరించి పాడేరు. గురువుగారు వైలిన్ వాయించేరు. వంకాయల నరసింహంగారు మృదంగం. ఆ రోజు వారు పాడిన తోడిరాగం నేను ఇప్పటికీ మరచిపోలేను. వీరి ఇంట్లో ఎప్పుడూ సంగీతం వినిపిస్తూనే వుండేది. ఒక సీనియర్ స్టూడెంట్, ఒక జూనియర్ స్టూడెంట్ కి ఆ జూనియర్ స్టూడెంట్ మరొక సబ్ జూనియర్ స్టూడెంట్ కి సంగీతం నేర్పుతూ గురుకుల వాసాన్ని పోలి, వారి ఇల్లు సంగీత వాతావరణంతో ఉండేది. నెల వారీ మొదటి ఆదివారం కచేరీలు నిర్విరామంగా 25 సంవత్సరాలు నిర్వహించబడినవి. తరువాత కొన్నాళ్లు వారి శిష్యులు, పంతుల గోపాలరావు గారు, పంతుల రమగార్లు కొనసాగించేరు.

భగవదనుగ్రహం వలన, గురువుగారి ఆశీర్వాదబలము వల్ల మొదటి ఆదివారం కచేరీలు కొనసాగించే భాగ్యం గత పది సంవత్సరాలుగా నాకు కలిగింది. ప్రతి ఏటా ఒక సంగీత సేవా భావము గలిగిన కళాకారునికి / కళాకారిణికి శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు మెమోరియల్ అవార్డు ఇచ్చే భాగ్యం మా దంపతులకు కలుగుతోంది, వి.జి.ఆర్. మ్యూజిక్ అకాడమీ అనే పేరుతో.



'పదవి నీ సద్భక్తి కల్గుటే' అనే సిద్ధాంతం తోనే శ్రీ ఇవటూరి విజయేశ్వరరావు గారు ఉండేవారు. 'వాయులీన విద్యా ప్రవీణ' 'వాయులీన సుధాకర', 'మాస్టర్ యం.యస్. అవార్డు', 'నాద భగీరథ', 'నాద సుధానిధి', 'సంగీత కళాసాగర' వంటి బిరుదులు ఎన్నివచ్చినా వారు నిరంతరం వైలిన్ వాదనతోనే దినం గడిపేవారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ప్రతిభారాజీవ్ పురస్కారం' తో గురువుగార్ని సత్కరించి, వారిచ్చిన లక్షరూపాయల పారితోషికాన్ని విజయ త్యాగరాజ సభవారికి మూలధనంగా ఇచ్చివేసిన సంగీత సేవా తత్పరులు శ్రీ విజయేశ్వర రావుగారు.

సమాజంలో సంగీత వ్యాప్తికి నిర్విరామంగా ఎన్నో విధాలుగా కృషి చేసిన శ్రీ ఇవటూరి విజయేశ్వర రావు గారు ఒక ఆదర్శమూర్తి.


★ ★ ★

పుస్తక సమీక్ష

## 'కర్నాటక సంగీత మార్గదర్శి'

# వింజమూరి వరదరాజ అయ్యంగార్

### ఆకాశవాణి శాస్త్రీయ సంగీత ప్రసార వినూత్న ప్రక్రియావిష్కర్త (1939-1966)




ఈ పేరున ఇటీవల విడుదలైన గ్రంథం సంగీత ప్రియులకు కరదీపికగా భాసిస్తున్నది. "వీరు సంగీత లక్ష్య, లక్షణ విజ్ఞులగుటచేత ఆకాశవాణిలో ఉద్యోగంలో ఉన్నకాలంలో భక్తిరంజని, సంగీతరూపకములు, సంగీత ప్రసంగములు, వివిధ వాగ్గేయకారుల పరిచయం, అపురూప కృతులను వెలుగులోకి తీసుకురావడం, రేడియో ద్వారా సంగీత శిక్షణ, రాగలక్షణ వివరాలు మొదలైన ప్రసారాలకు ఆద్యులు. తమ సేవాధర్మాన్ని వీరు బహుముఖీనంగా నిర్వహించారు.

సంగీత పరంగా అనేక విషయాలు కలిగిన ఈ పుస్తకం అన్ని సంగీత విద్యా సంస్థల్లో పాఠ్యాంశంగా పెట్టదగినది. అన్ని గ్రంథాలయంలో వుంచదగిన పుస్తకం. సంగీతానికి సంబంధించిన వారందరూ చదువ తగిన పుస్తకం."

ఈగ్రంథం పై 'ప్రణవ నాదోపాసక', 'కలైమామణి' డా॥తాడేపల్లి లోకనాథశర్మగారు వెలిబుచ్చిన చిక్కని, చక్కని అభిప్రాయం ఇది..

అలాగే ప్రముఖ వైలన్ విద్వాంసులు శ్రీ టి.కె వి.రామానుజాచార్యులు "ఈ గ్రంథంలో సుమారు 60కి పైగా రాగాలకు వింజమూరి వారి వివరణలున్నాయి. ఇంకా అనేక రచనలపై విశ్లేషణలున్నాయి. ప్రముఖ వాగ్గేయ కారుల జీవిత విశేషాలున్నాయి. సంగీత ప్రపంచానికి ఎన్నో అమూల్యమైన వివరణలిచ్చిన మహామహులు వింజమూరి వారు. కుమార్తె సంధ్యగారు ఈ గ్రంథ ప్రచురణ ద్వారా సంగీత లోకానికి మహోపకారం చేసినట్లు గా నేనుభావిస్తా"నని తెలిపారు.

ఇంక ఇందులో వింజమూరి వారి భక్తి రంజని పట్టిక–వివరాలు;సంగీత ప్రసంగాల నోట్సు; వెలువరించిన సంగీత రూపకాలు–పాఠం; సంగీత రచయితలపై వారి ఉపన్యాసాలు; సంగీత సంచికా కార్యక్రమం; విశేష సంగీత కచేరీలు; రాగలక్షణం శీర్షికలో 65 రాగాలపై సాధికారిక వివరణ; అనుబంధం శీర్షికన ఇతర ముఖ్య విషయాలు కలగలిపి 628 పేజీల గ్రంథమై మనకు విశేషమైన వివరణలను అందిస్తున్నది.

ఈ సంకలనం చూడగానే తండ్రి ఋణం కొంతైనా తీర్చుకోవడానికి కుమార్తెగా సంధ్యా వింజమూరి గిరి పడ్డ తాపత్రయానికి జోహారు పలుక వలసినదే! దీనికై ఆమె తిరగని ప్రదేశం లేదు, గ్రంథాలయం లేదు; రేడియో స్టేషన్ లేదు; కలవని విద్వాంసులు లేరు. ఒక తపస్సుగా భావించి సాధించారు.

చరిత్ర సాక్ష్యాధారాలతో అక్షర బద్ధం కాకపోతే భావి తరాలకు తప్పుడు సమాచారం వెళుతుంది.

ఈ ప్రయత్నం ద్వారా సంధ్యగారు తండ్రిగారిని శిఖరాగ్రాన సుప్రతిష్ఠితం చేశారు. చెబితే వినే కన్నా ఓ సారి చదివితే సంగీత విద్యార్థులకు, విద్వాంసులకు, సంగీత ప్రియులకు అవగతమౌతుంది ఈ ప్రయత్నం ఎందుకో! ఆనాడు ఈనాడున్న ప్రచార ఆర్భాటాలు లేని కారణంగా పూర్తి విషయాలు అందరికీ అందే అవకాశం లేకపోయింది. ఆ కొరత ఈ గ్రంథం తీరుస్తుంది. **"గానకళానిధి" డా॥వింజమూరి వరదరాజ అయ్యంగార్ మెమోరియల్ ట్రస్ట్-చెన్నై తరపున ప్రచురించిన ఈ పూర్తి బైండ్ పుస్తకం కై :9176641308 నెంబరు లేదా sandhyavinjamuri@yahoo.com ద్వారా సంప్రదించగలరు.**

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## విశాఖ మ్యూజిక్ అకాడమి - విశాఖపట్నం




తన నెలనెలా సంగీతకార్యక్రమాలలో భాగంగా విశాఖ మ్యూజిక్ అకాడమీ మహాశివరాత్రి పర్వదినాన అనగా తే.18.02.23ది నాటి సాయంత్రం చెన్నైకు చెందిన గాత్రవిద్వాంసులు శ్రీ వివేక్ సదాశివం గాత్రసంగీతసభను స్థానిక కళాభారతి ఏసి ఆడిటోరియంలో యేర్పాటు చేసింది. ప్రఖ్యాతకార్టూనిష్టు శ్రీసరసి కళాకారులకుసత్కారమందించిన అనంతరం బేగడరాగ వర్ణంతో తమ గానాన్ని వినిపించడం ఆరంభించి సుమారు మూడుగంటలపాటు శ్రోతలను ఆనందలహరులలో తేలియాడించారు విద్వాంసులు. అరుదైన జయంతసేన రాగంలో "వినతాసుతవాహన" అన్న కీర్తనతో తన ప్రణాళికను ఆరంభించి, పసందైన పంతువరాళి రాగాలాపన, "శంభోమహాదేవ" అంటూ నాభీహృత్కంఠరసన – అన్నట్లుగా నాదాన్ని పలికిస్తూ, తన ఆర్తినిజోడించి నెరవల్ తో సహా స్వరకల్పనలతో రసజ్ఞులను మైమరపించారు సదాశివం. కీర్తన ఆరంభంలో ఆయన వినిపించిన ఆదిశంకరుల శ్లోకం సందర్భోచితం. వెనువెంటనే శివుడు ప్రత్యక్షమై వరమిచ్చినంత హాయిగా కేదార రాగంలో, "ఆనందనటనప్రకాశం" కీర్తన, శ్రుతిరంజని రాగంలో "యేదారి సంచరింతురా" కీర్తన మనోహరంగా సాగాయి. ముఖ్యాంశంగా ఖరహరప్రియ రాగాలాపన, "చక్కనిరాజమార్గము" అంటూ అక్కడక్కడ అనునయంగా, అప్పుడప్పుడు కాస్త ధాటిగా "సందులదూరనేల" అని మనసుకు నచ్చజెబుతూ సాగిన అంశం గాయకుని విద్వత్తుకు నిదర్శనంగా నిలచింది. లయవిన్యాసం అనంతరం అన్నమయ్య రచన "ముద్దుగారే యశోద" వినిపించి బేహాగ్ రాగశ్లోకంతో రసవత్తరమైన సభను ముగించారు శ్రీవివేక్ సదాశివం.

వాయులీనంపైన డా. యమ్. సత్యనారాయణశర్మ, మృదంగంపై శ్రీ యోగీశ్, ఘటంపై శ్రీ యస్. హనుమంతరావులు సహకరించి తమతమ విద్వత్తును సమయానుకూలంగా ప్రదర్శిస్తూ సభకు పరిపుష్టిని చేకూర్చడమేకాక మంచి పట్టుగల తనియావర్తన ప్రతిభతో కరతాళధ్వనులను అందుకున్నారు. ఆరంభంలో కళాకారులపరిచయం శ్రీమతి సునీత అందించగా వియెస్సెన్మూర్తిగారు సంగీతసభను సమీక్షించడంతో గాత్రసభ ముగిసింది.

మహాశివరాత్రి పర్వదినాన శ్రోతలు తగినసంఖ్యలో రావడమేకాకుండా ప్రతి అంశాన్నీ మెచ్చుకోవడం విశేషం.

**వి.యస్.యస్.యన్. మూర్తి.**

**విశాఖ మ్యూజిక్ అకాడమి తన నెలవారీ సంగీత సభలలో** భాగంగా మార్చి 26వతేది ఆదివారంనాటి సాయంత్రం, స్థానిక కళాభారతి ఆడిటోరియంలో, రాజమండ్రి వాస్తవ్యులైన విదుషి శ్రీమతి తులసి విశ్వనాథ్ గారి గాత్రసంగీత సభను యేర్పాటుచేసింది. అకాడమి ప్రతియేటా అందిస్తూవస్తున్న "భక్త జ్ఞానానందతీర్థ ఓగిరాల వీరరాఘవశర్మ" అవార్డును ఈ సందర్భంగా శ్రీమతి తులసి విశ్వనాథ్ గారికి సమర్పించడం జరిగింది. అవార్డు ప్రదానోత్సవ సభలో అకాడమీ కార్యదర్శి శ్రీ యెమ్మెస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డా.పేరాల బాలమురళి

కృష్ణ, కోశాధికారి శ్రీ వీరఘంట చంద్రశేఖర్ పాల్గొన్నారు. సన్మానసభ శ్రీ వియెస్సెన్మూర్తి స్వాగతవచనాలు, ప్రార్థన తో ఆరంభమవగా, సన్మానం శ్రీమతి యమ్ కె సునీత మరియు శ్రీమతి లలిత చంద్రశేఖర్ గారలు శుభప్రదంగా జరిపించారు. సన్మాన గ్రహీతను పెద్దలు, చందన కుంకుమలతో, పుష్ప చందనమాలలతో, శాలువ మరియు పదివేలరూపాయల నగదు బహుమతులతో సత్కరించగా, కార్యదర్శి యమ్మెస్ శ్రీనివాస్, శ్రీ వియెస్సెన్మూర్తి రూపొందించిన ప్రఖ్యాపన పత్రాన్ని శ్రీమతి తులసి గారికి అందించారు.

అనంతరం జరిగిన శ్రీమతి తులసి విశ్వనాథ్ గారి గాత్రసంగీత సభ రసవత్తరంగా సాగింది. శ్రీ వీరరాఘవశర్మ గారు రచించిన భక్తిప్రధానమైన సంగీత రచనలనుండి అపురూపమైన మూడు కీర్తనలను శ్రీమతి తులసిగారు ఆలాపించి తన కృతజ్ఞతను గౌరవాన్ని తెలియజేసుకున్నారు.




"ఆదినాట" అని పెద్దలన్నట్లుగా నాటరాగంలో శ్రీ నారాయణతీర్థులవారి తరంగము "జయజయ స్వామిన్" అంటూ సంప్రదాయబద్ధంగా ఆరంభించి, అఠాణా రాగంలో "అనుపమ గుణాంబుధి" కీర్తన అనంతరం వలజి రాగంలో ఓగిరాలవారి రచన "శ్రీగాయత్రి" కీర్తనను స్వల్పరాగాలపన స్వరకల్పనలతో గానం చేశారు. తదుపరి వసంత రాగంలో "బృహదంబికాయై"కీర్తనతోపాటు,ఓగిరాలవారి గంభీరనాట రాగరచన "అపారకృపానిధి" అంటూ వారిని స్మరించుకొని, నాటకురంజి రాగంలో "పార్వతీకుమారం" కీర్తనను, మరల ఓగిరాలవారు సృష్టించిన "ప్రణవప్రియ" రాగంలో వారిరచన "పదారవిందములే" అన్న అంశాన్ని, మోహనరాగంలో "దయరానీ" అన్న త్యాగరాజ కీర్తనను భక్తిపూర్వకంగా వినిపించి ముఖ్యాంశంగా తోడిరాగకీర్తన "కద్దనువారికి" గానంచేస్తూ శ్రోతల కరతాళధ్వనులు అందుకున్నారు శ్రీమతి తులసిగారు. సుమారు రెండున్నరగంటలు సాగిన మధురగానం, హంసానంది రాగంలో పురందరదాస రచన "ఆతనపాడువే", త్యాగరాజస్వామి రచన "దశరథనందన", అహీర్ భైరవ్ రాగతిల్లానాల అనంతరం మంగళంతో సుసంపన్నమైంది.

శ్రీ పెరవలి నందకుమార్ వాయులీన సహకారం రాగాలాపనలో స్వరకల్పనలలో గాత్రానికి అనుగుణంగా సాగుతూ రక్తికట్టించింది.

శ్రీ పెరవలి జయభాస్కర్ సాత్వికమూ, సుమధురమూ అయిన నాదంతో తన మృదంగవాద్య ప్రతిభను తెలియజేయడమే కాక ఘటంపై యథోచితంగా సహకరించిన శ్రీ యమ్ సూర్యప్రసాదరావుగారితో కలసి ఘనమైన లయవిన్యాసాన్ని అందించారు.

డా. పేరాల బాలమురళీకృష్ణగారి సమీక్ష సభకు మంచి ముక్తాయింపుకాగా శ్రోతలకు వీనులవిందైన గాత్రాన్ని విన్న అనుభూతి కలిగించారు శ్రీమతి తులసి విశ్వనాథ్ గారు. కార్యక్రమానికి ప్రాయోజికతను సమకూర్చిన ఓగిరాలవారి కుటుంబసభ్యులకు అకాడమీ ధన్యవాదాలు తెలియజేయడంతో సభ విజయవంతంగా ముగిసింది.

**వి.యస్.యస్.యన్. మూర్తి.**
విశాఖ మ్యూజిక్ అకాడమి

## అభినందన

**ఆంధ్రమహిళాసభ, హైదరాబాద్, కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చైర్ పర్సన్ గా సంగీత విదుషి డా.యర్రమిల్లి రమాప్రభ పదవీ బాధ్యతలు ది.13.4.2023న స్వీకరించారు. వారి నేతృత్వంలో సంస్థ మరిన్ని విజయాలను సాధించాలని కోరుతూ శుభాభినందనలు అందజేస్తున్నది గానకళ.**

# శ్రీరామగాన సభ (రిజిష్టర్డ్), హైదరాబాదు

శ్రీరామగాన సభ (రిజిష్టర్డ్), హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, న్యూ నల్లకుంట, శ్రీరామాలయ ప్రాంగణంలో "సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 54వ వార్షిక ఉత్సవాలు 25-02-2023 నుండి 05-03-2023 వరకు తొమ్మిది రోజులు జరిగాయి.

**25-02-2023 : 1వ రోజు**

సాయంత్రం 5.00 గం.లకు మంగళవాయిద్యంతో ప్రారంభించి తదుపరి నాదోపాసన బృందం చే దివ్యనామ సంకీర్తన గానం చేశారు. ఇందులో పాల్గొన్న కళాకారులు శ్రీమతలువోరి విజయశ్రీ, కొణికి లలితా శ్రీనివాసు, కె. ధనలక్ష్మి, సరస్వతి.

అనంతరం శ్రీ చేబియ్యం రామకృష్ణ (సౌత్ సెంట్రల్ రైల్వే విశ్రాంత జనరల్ మేనేజర్) ప్రారంభోత్సవము మరియు జ్యోతి ప్రజ్వలనము గావించారు.

వారు సభాకార్యక్రమములు గురించి మాట్లాడుతూ దేవాలయప్రాంగణములో గత 53ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం విశేషం. ఈ సభద్వారా ఎంతోమంది కళాకారులు పాల్గొని వారు ఈ రోజున విశేషంగా రాణిస్తూ రేడియోలో "ఎ" టాప్ గ్రేడ్ లు సాధించారు. ఇలా చాలా మంది పొందడం ఆనందాయకం.

ఇందులో పాల్గొన్న ఇతరులు శ్రీ జి. నాగరాజన్ (ప్రెసిడెంట్), కె.వి. తిరుమల రావు, కె.యస్. ఆనంద్ మరియు కొణికి శ్రీనివాస శర్మలను అభినందించారు.

అలాగే ఈ సభ నూరేళ్ళ పండుగ ఉత్సవాలు నిరాటంకంగా జరుగవలెనని ఆకాంక్షించారు.

అనంతరం సాయంత్రం 7.00 గం.లకు శ్రీమతి అచలా శంకర్ నాథ్ వీణావాదన వీనుల విందుగా సాగింది. ఇందులో ప్రధానంగా బ్రోవ భారమా; తెలియలేరు రామ, నీరజాక్షి కామాక్షి మరియు తిల్లానా తో ముగించారు. వీరికి మృదంగంపై శ్రీవిద్యాసాగర్, ఘటంపై శ్రీ వి. శ్రీధరాచారి సహకరించారు.

**26-02-2023 : రెండవ రోజు :** మొదటగా శ్రీమతి కుప్పా శారద గానం చేశారు. "గిరిరాజసుత" అప్పరామ భక్తి, ప్రధానంగా "ప్రక్కలనిలబడి" గానం చేశారు. వీరికి శ్రీమతి రాధిక శ్రీనివాసన్ వయొలిన్ పై మరియు మృదంగంపై డా. ఆర్. శ్రీకాంత్ అనువుగా వాయించి కచేరి రక్తిగా సాగించు.

తదుపరి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన "మంగళంపల్లి" వారి శిష్యులైన శ్రీ డి.వి. మోహనకృష్ణ గానం చేశారు. అందులో ముఖ్యమైనవి "శోభిల్లు సప్తస్వర", "బాగాయెనయ్యా", "నన్ను విడచి" ప్రధానంగా "కనుగొంటిని శ్రీరాముని" అనే కృతిని విస్తారంగా గానం చేశారు.

చక్కటి నెఱవు, ఆశువుగా స్వరకల్పన చేసి సంగీత రసికులను ఆకట్టుకొన్నారు. వీరికి శ్రీ పెరవలి జయభాస్కర్ మృదంగంపై సహకరించి చక్కటి తని వినిపించారు. రకరకాల నడకలను, గతులను వాయించి ప్రేక్షకులను రంజింప చేశారు. ఘటంపై శ్రీ బి. జనార్ధన్ సహకరించారు.

వయొలిన్ పై వర్ధమాన కళాకారిణి కు. గాయత్రి శివాని చాలా అద్భుతంగా మరియు అనువుగా వాయించి కచేరి రక్తి కట్టించారు.




**27-02-2023 : మూడవ రోజు :** మొదటగా కు. శిష్టా హేమశ్రీ సుమద్యుతి వర్ధమాన కళాకారిణి పలు కీర్తనలు శ్రావ్యంగా గానం చేశారు.

వీరికి శ్రీ శిష్టా రమణమూర్తి వయొలిన్ పై శ్రీ బులుసు రవికుమార్ మృదంగంపై సహకారం అందించారు.

తదుపరి కోలంక సోదరులు అనిల్ కుమార్, సాయికుమార్ వయొలిన్ ద్వయం కచేరి జనరంజకంగా సాగింది.

వీరు సావేరి వర్ణంతో ప్రారంభించి, "సీతమ్మ మాయమ్మ", "బంటురీతి" ప్రధానంగా "ఎందుకు

దయరాదు'' వాయించి పహాడ్ రాగం తిల్లానా తో ముగించారు. వీరికి శ్రీ సిరిపల్లె నాగేశ్వరరావు మృదంగంపై, శ్రీ యం. చంద్రకాంత్ ఘటంపై చక్కగా సహకరించారు.




**28-02-2023 : నాలుగవ రోజు :** మొదటగా ''కీర్తన'' సంగీత విద్యా సంస్థ వారి శిష్యబృందంచే వర్థమాన గాయనీమణులు వారి విద్యను చక్కగా శృతి, లయ బద్ధంగా ప్రదర్శించారు.

వీరికి వయొలిన్ పై కె.యల్.యన్. మూర్తి, మృదంగంపై వీరంరాజు లక్ష్మీ అజయ్ అనువుగా సహకరించారు.

వీరికి శ్రీమతి యం.వి. కమలారమణి గారు మంచి శిక్షణ ఇచ్చారు.

అనంతరం శ్రీమతి యం.వి. కమలారమణి కచేరి జరిగింది. వీరు ప్రధానంగా ''అభిమాన మెన్నడు'', బేగడరాగంలో చక్కగా గానం చేశారు. తరువాత ఆదితాళం చౌకకాలంలో పూర్వీకళ్యాణి రాగంలో ''నిన్ను వినా'' గానం చేసి వారి అనుభవంతో చక్కని స్వర కల్పన చేసి, మంచినెఱవు, వినిపించారు. కచేరి ఆద్యంతం రసవత్తరంగా సాగింది.

దీనికి సర్వశ్రీ పి.యస్. గోపాలన్ మృదంగంపై, జనార్ధన్ ఘటంపై, కోలంక సాయి కుమార్ వయొలిన్ పై సహకరించారు.

**01-03-2023 : అయిదవ రోజు :** మొదటగా శ్రీమతి సి.హెచ్. కృష్ణవేణి వరంగల్ వాస్తవ్యులు గానం చేశారు. చక్కటి సంప్రదాయంతో గానం చేశారు. వీరికి మంచి అనుభవం కలిగిన శ్రీ యన్.సి. అనంతకృష్ణ వయొలిన్ పై, శ్రీ పి. దుర్గాకుమార్ మృదంగంపై చక్కటి సహకారం అందించారు.

తదుపరి అపర రామ భక్తులు అయిన శ్రీ నేంద్రగంటి కృష్ణమోహన్ పలుకీర్తనలు భక్తితో గానంచేశారు. అందులో రామదాసు కీర్తనలు శ్రావ్యంగా గానం చేశారు.

అనంతరం శ్రీ పి.వి.. సుబ్బారావు కచేరిలో పలు కీర్తనలు గానం చేశారు. ''తెరతీయగ రాదా'' ''తులసమ్మ'' ప్రధానంగా ''కనుగొంటిని'' గానం చేశారు. మంచి నెఱవు, స్వరకల్పనలు చేసి ప్రేక్షకులను రంజింపచేశారు.

వీరికి వయొలిన్ పై సర్వశ్రీ ఎ. శివకృష్ణ స్వరూప్, మృదంగంపై కర్రా శ్రీనివాస రావు, తబలాపై గుణరంజన్ చక్కటి సహకారం అందించారు.

**02-03-2023 : ఆరోవ రోజు :** శ్రీ ఆర్.వి. పాందు రాఘవనారాయణ, సి.హెచ్. శివరామకృష్ణ సోదరులు పలు కీర్తనలు యుగళగానం చేశారు. వీరికి డి. జయసూర్య వయొలిన్ పై, మృదంగంపై కొళ్ళెగాల్ గణపతిరామ్ చక్కటి సహకారం అందించారు.

తదుపరి ప్రఖ్యాత విద్వాంసులు కీ.శే. మండా బలరామశర్మగారి శిష్యుడు శ్రీ కొమ్మెర్ల ఉమావేంకటేశ్వర్లు వేణుగాన కచేరి జరిగింది.

వీరు పలుకీర్తనలు వాయించి తన అనుభవంతో మంచి నెఱవు, రాగాలను చక్కటి స్వర కల్పనలతో రసికులను ఆనందపరిచారు.

వీరికి కర్రా శ్రీనివాసరావు చక్కటితని ఆవృతం వాయించి వినిపించారు. మంచి నడకలు, గతులతో తన అనుభవాన్ని ప్రదర్శించారు. అలాగే కోలంక సాయి కుమార్ వీరికి చాలా అనువుగా వాయించి కచేరిని జనరంజకంగా ముగించారు.

**03-03-2023 : ఏడవ రోజు :** మొదటగా చెన్నై వాసులు గానం చేశారు. వీరి ''వినాయక'' బృందావన సారంగ రాగంలో ''కమలాప్తకుల'' ప్రధానంగా ''బ్రోవ భారమా'' గానం చేశారు. వీరికి కోణికి మణిరఘురామ్ మృదంగంపై చక్కటితని ఆవృతం వాయించారు. శ్రీ బి. సీతాపతి రావు వయొలిన్ పై సహకరించారు.

తదుపరి శ్రీ కొణికి మణిరఘురావు గానం చేశారు. వీరు కళ్యాణి వర్ణంతో ప్రారంభం చేసి ''శ్రీ గణపతిని'', ''రంగపుర విహార'' ప్రధానంగా '' రంగ శాయి'' కాంభోజి రాగంలో చక్కటి స్వరకల్పనలు చేసి ప్రేక్షకులకు రంజింపచేశారు.

వీరికి చెన్నై వాసులైన శ్రీ సుదర్శన్ మృదంగం వాయించారు. అలాగే శ్రీ బి. సీతాపతి రావు వయొలిన్ పై చక్కటి సహకారం అందించారు.

తదుపరి బెంగుళూరు వాసులైన శ్రీ ఆర్.

వాసుదేవన్ కచేరి జరిగింది. వీరు శహన రాగ వర్ణంతో ప్రారంభించి కళ్యాణి రాగంలో గణపతే హనుమతే, ''తెలసిరామచింతనతో'' ప్రధానంగా చక్కటి నెఱవులతో స్వర కల్పనలు చేసి, ''ఎదుటనిలిచితే'' శంకరాభరణము రాగంలో దిగ్విజయంగా గానం చేశారు.

వీరికి పి.యస్. గోపాలన్ చక్కటి మృదంగంపై సొగసైన నడకలతో వాయించారు. ఘటంపై యం. చంద్రకాంత్ చక్కటి సహకారం అందించారు. కొమాండూరి శౌరి రాజన్ తన అనుభవంతో వయోలిన్ పై సహకరించారు. కచేరి ఆద్యంతం రసవత్తరంగా సాగింది.

**04-03-2023 : ఎనిమిదవ రోజు :** మొదటిగా మాస్టర్ డి.వి. యస్. ప్రణవ్ క్యాసియోపై కీర్తనలు వాయించారు. ''బాలకృష్ణ మోహన'' ప్రధానంగా వాయించారు. చక్కటి ప్రదర్శన ఇచ్చారు. ఇతనికి మంచి భవిష్యత్తు వుంటుందని కార్యదర్శి శ్రీనివాసశర్మ అన్నారు.

తరువాత బెంగులూరు వాసి శ్రీమతి డి.వి. యస్. హరి ప్రియ శ్రావ్యంగా గానం చేశారు. వీరికి రోహిత్ కుమార్ మరియు వినయ్ కృష్ణ వయోలిన్ పై మృదంగంపై వి. లక్ష్మీ అజయ్ సహకరించారు.

తదుపరి డా. వైజర్స్ బాలసుబ్రహ్మణ్యం ''భైరవి సంగీత విద్యా సంస్థ'' శిష్యులు కుమారీలు శ్రావణి, స్వాతి, శర్వాణి రిషిత, రితిక గానం చేశారు.

ప్రధానంగా కుమారి ప్రణతి వైజర్స్ గాన కచేరి జరిగింది.

వీరు నాటరాగంలో ''నిన్నే భజన'' అసావేరి రాగంలో ''జానకి సమేత'', ''మారవైరిరమణి'', ప్రధానంగా తోడిలో ''చేసినదెల్ల'' కృతిగానం చేశారు. చక్కగా నెఱవు, స్వరకల్పనలతో గానం చేసి సంగీత రసికులను మెప్పించారు.

వీరికి మృదంగంపై సి.హెచ్. రామకృష్ణ చక్కగా సహకరించి కచేరిని సుసంపన్నం చేశారు. అలాగే వయోలిన్ పై శ్రీ భట్టి పవన్ సింగ్ చక్కటి సహకారం అందించి రసికులను రంజింపచేశారు.

**05-03-2023 : తొమ్మిదవ రోజు :** ఉదయం 9.00 గం. లకు త్యాగరాజు స్వామి వారికి పూజాదికాలు గావించిరి. అనంతరం ''స్వరరాగ'' విద్యాసంస్థ విద్యార్థులు గానం చేశారు. వీరికి మృదంగం విద్వాసుంరాలు శ్రీమతి కె. వీణాధరి సంగీత శిక్షణ ఇచ్చారు.

తదుపరి తిరువాయూర్ వాస్తవ్యులు శ్రీమాన్ జ. నాగరాజన్ భాగవతార్ రామాలయంలో ఉంఛవృత్తి గావించారు. వీరి వెంబడి ప్రముఖ గాయకులు ఎన్. రామమూర్తి, ఆర్.వి..పి శర్మ, కె.యే. యస్. రాజన్ పాల్గొన్నారు. పలు కీర్తనలు ఆలపించి ఉంఛవృత్తి చక్కగా ముగించారు.

తదుపరి ప్రఖ్యాత విద్వాంసులు శ్రీ డి.వి. మోహన కృష్ణ, వాసాగోపినాథ్, రామ్మూర్తి, పి.వి. సుబ్బారావు తదితరులు ''పంచరత్న గోష్ఠి''గానం చేశారు.

వీరికి మృదంగం పై పి. జయ భాస్కర్, పి.యస్. గోపాలన్, మణిరఘురామ్, మరియు వయోలిన్ పై యస్. వి. రమణమూర్తి, కె.యల్.యన్. మూర్తి తదితరులు పాల్గొని సంగీత రసికులను రంజింపచేశారు. అనంతరం ఆరువందల మంది మహా ప్రసాదం స్వీకరించారు.




సాయంత్రం ''ఉత్తర సెంటర్ ఫర్ పెర్ఫామింగ్ ఆర్ట్ అధ్యక్షురాలయిన ''శ్రీమతి గీతా గణేశన్ ఆధ్వర్యంలో వారి శిష్యబృందం చే ''భరతనాట్య'' ప్రదర్శన జరిగింది.

దీనిలో ప్రధానంగా ''గజేంద్రమోక్షము'' శివపార్వతుల ఘట్టము, తదితర అంశాలు ప్రదర్శించారు.

ప్రేక్షకులు అన్ని కార్యక్రమములకు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేశారు.

అనంతరం ''ఆంజనేయ''స్తుతి శ్రీమతి గీతా గణేశన్ గారి ఆధ్వర్యంలో భజనతో కార్యక్రమాలు ముగిశాయి.

అనంతరం కార్యదర్శి కొణికి శ్రీనివాస శర్మ, శ్రీమతి లలిత, కె.వి. తిరుమలరావు, కె.యస్. ఆనంద్, శ్రీమతి రోహిణి గార్లు కళాకారులను సముచితంగా సత్కరించగా, కార్యదర్శి పేరు పేరున అందరికీ ధన్యవాదాలు పలికి ఉత్సవాలను జయ ప్రదంగా ముగించారు.

**- కె.ఎస్.ఎస్.**

# గాయత్రి మహిళా సంగీత సన్మండలి - గుంటూరు







గాయత్రీ మహిళా సంగీత సన్మండలి గుంటూరు వారి ఆధ్వర్యంలో షడ్వింశతి వార్షికోత్సవము 11-3-2023, 12-3-2023 న అన్నమయ్య కళావేదిక శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం బృందావన్ గార్డెన్స్ లో వైభవోపేతంగా జరిగినాయి. 11-3-23 సా. 6.16 కు దేవస్థానం అధ్యక్షులు శ్రీ మస్తానయ్య శ్రీ జూపూడి రంగరాజు, శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం విదుషి యస్. మహతి – చెన్నై గాత్రకచేరీ జరిగింది. నాట రాగంలో మహాగణపతితో ప్రారంభించి, శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు, అలరులు కురియగ – శంకరాభరణం, లలిత రాగంలో హిరణ్మయీం, ప్రధాన అంశంగా తోడి రాగంలో కద్దను వారికి తో చక్కగా రాగం, నెరవలు, స్వరంతో తనకున్న విద్వత్తును చూపించారు. మంగళంపల్లి బాల మురళీకృష్ణగారి తిల్లాన నాదరితోంతో కచేరి ముగిసింది. శ్రీమతి వి దుర్గా భవానీ విజయవాడ వైలిన్ పై చక్కగా సహకరించారు. చెన్నైకి చెందిన శ్రీ బుర్రా శ్రీరామ్ మృదంగంతోనూ, గుంటూరుకు చెందిన శ్రీ యం. హరిబాబు ఘటంతోను సహకరించారు. కార్యక్రమం అసాంతం సంగీత రసజ్ఞుల మన్ననలు పొందింది.

12-03-23 ఆదివారం షడ్వింశతి వార్షికోత్సవసభ కుమారి వై. రాజ్యలక్ష్మి ప్రార్థనా గీతంతో ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన, సభాధ్యక్షులు డా. పి. విజయ గారు చేసారు. ముఖ్య అతిథిగా శ్రీ మండలి బుద్ద ప్రసాద్ గారు పాల్గొన్నారు. స్వర్ణపతకాన్ని మృదంగ కళాకారుడు విశాఖపట్నంకు చెందిన చి. సాయి కేశవ సబేశన్ కు బహూకరించారు. స్వర్ణ పతకాన్ని గాయిత్రి మహిళా సంగీత సన్మండలి కార్యవర్గం సమర్పించారు. అనంతరం విశాఖకు చెందిన కుమారి వ్యాకరణం గాయిత్రి విభావరి శాస్త్రీయ సంగీత కచేరీ జరిగింది. నాట రాగంలో స్వామినాథ, అసావేరిలో రారామాఇంటిదాక, కీరవాణిలో కలిగియుంటే, చాలా చక్కగా, మంచి అనుభవం ఉన్నట్లుగా రాగం, నెరము, స్వర కల్పనతో ఆలపించింది. శ్రీరంజని లో ముద్దు గారె యశోద మొదలైనవి సంగీత ప్రియులను ఆకట్టుకున్నవి. స్వర్ణపతక గ్రహిత చి. కేశవ్ తన మృదంగ విన్యాసంతో వీనుల విందుగా సహకరించారు. తన మృదంగం వాయిద్యం ఇంత చిన్నవాడు ఎంత బాగా వాయించాడో అని అందరూ అభినందించారు. వయోలిన్ సహకారం అందించిన శ్రీ మహావాది వాసు విశ్వనాథ శాస్త్రి ఎంతో చక్కగా సహకారం అందించారు. ఈ ముగ్గురు చేసిన సంగీత కచేరి ప్రేక్షకుల మన్ననలు పొందింది. ప్రత్యేక సంచికని పద్మశ్రీ డా. అన్నవరపు రామస్వామి గారు గౌరవ అధ్యక్షులు గాయత్రీ మహిళా సంగీత సన్మండలి వారు ఆవిష్కరించారు.

వార్షికోత్సవ సభలో నగదు బహుమతిని శ్రీమతి బెండపూడి లక్ష్మీ కుమారికి అందించారు. ఉత్తమశ్రోతగా ఆర్.పి.యల్. నరసింహం, వి. జయగార్లకు అందించారు.

ఈ సభ ప్రధాన సమర్పకులు డా. పి. విజయ, వడ్లమాని రవి, డా. కోటి రమణకుమార్ బయ్యా శ్రీనివాసరావు, గుళ్లపల్లి సుబ్బారావు గారలు. కార్యక్రమాన్ని సన్మండలి అధ్యక్షులు డా. పి. విజయ, ప్రధాన కార్యదర్శి. యం.వి. శేషురాణి, కార్యదర్శి మంగాదేవి, పాటిబండ లలితాదేవి పర్యవేక్షించారు.

★ ★ ★

# ఘనముగా ముగిసిన హరికథా పితామహ ఆదిభట్ల మరియు నేతి లక్ష్మీనారాయణ భాగవతుల సంస్మరణ పూర్వక హరికథాగానం




'హరిదాస జగద్గురు' శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస వర్యుల మరియు వారి ప్రియ శిష్యులైన 'హరికథా కేసరి' కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతుల సంస్మరణ పూర్వక హరికథాగానం శ్రీ నారాయణదాస శిష్య ప్రశిష్య సంఘం, విజయవాడ; కీ. శే. నేతి లక్ష్మీనారాయణ భాగవతుల కుటుంబ సభ్యుల; అన్నమయ్య పరివారము (హైదరాబాద్) మరియు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వారి సంయుక్త నిర్వహణలో విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణములో మార్చి 25, 2023 శనివారము నాడు ఘనముగా నిర్వహింప బడినది.

ఆ నాటి కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైనది. శ్రీమతి కె లక్ష్మీనరసమ్మ (అధ్యాపకురాలు, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల), శ్రీ నేతి విశ్వేశ్వర రావు (కార్యదర్శి, త్యాగరాయ సాంస్కృతిక సంఘం, గుంటూరు) మరియు శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య (అన్నమయ్య పరివారము, హైదరాబాద్) జ్యోతి ప్రజ్వలన చేసి హరికథా రంగములో దాసవర్యుల మరియు నేతి వారి సేవలను పలు విధములుగా కొనియాడారు.

శ్రీమతి కె. లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ నారాయణదాసు పుంభావ సరస్వతి, జగత్ప్రసిద్ధులైన హరికథక పితామహులు, కారణజన్ములు, మనదేశంలో హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు అని కొనియాడారు.

శ్రీ నేతి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నారాయణదాస వర్యుల విగ్రహం విజయవాడలో ప్రతిష్ట గావింపబడటం అదృష్టమని, ప్రతిష్ట చేసిన శ్రీవారి ప్రియ శిష్యులు నేతి లక్ష్మీనారాయణ భాగవతులు ధన్యులని ప్రశంసించారు.

శ్రీ యనమండ్ర వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ నారాయణదాసు మైసూరు మహారాజు సంస్థానములో సంగీత ప్రదర్శనమూ, హరికథా ప్రదర్శనమూ అసమానంగా జరిపి అఖండ సన్మానము పొంది విజయనగరం వచ్చిన పిమ్మట శ్రీ ఆనంద గజపతి మహారాజు సన్మానము పొంది ఆస్థానపండితులైనారని; విద్యలకు నిలయమైన విజయనగరంలో ఆనందగజపతి మహారాజుని విద్యా పరీక్షణ వేళలో మెప్పించి తదుపరి దక్షిణాది రాష్ట్రములలో విజయనగర ప్రభువులు ప్రప్రధముగా 1919లో ఏర్పాటుచేసిన 'శ్రీ విజయరామ గాన కళాశాల' ప్రధమ ప్రధానాచార్య పదవినలంకరించి సుమారు పదునేడు వత్సరములు తమ సంగీతపాండితీ విధానమును పలువురు శిష్యులకు పంచిపెట్టిన మహానుభావులు అనియు తెలిపారు.

తదుపరి శ్రీమతి కె. శారదా భాగవతారిణి (తాడేపల్లిగూడెం) నారాయణ దాస విరచిత "సీతాకళ్యాణం" హరికథాగానం చేసారు. వీరికి డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయొలిన్ పైన మరియు శ్రీ కాపవరపు సుబ్బారావు మృదంగం పైన చక్కని సహకారం అందించారు శ్రీ బుర్రా పద్మనాభ శర్మ భాగవతుల పర్యవేక్షణలో కార్యక్రమము దిగ్విజయముగా జరుపబడినది.

- గండూరి శారద

# విజయవాడ హరికథాగానం లో నేతి వారి కుటుంబ సభ్యులు




# గాయత్రీ ఫైన్ ఆర్ట్స్ & ద్వారకాలయ-ఢిల్లీ.




వారి ఆధ్వర్యంలో 12.3.2023 న కుమారి ప్రణతి వైజర్స్ గాత్ర సంగీత సభ అందరినీ అలరించింది. శ్రీ ఢిల్లీ .ఆర్.శ్రీధర్ వైలన్ పై;శ్రీ కుంభకోణం ఎన్. పద్మనాభం మృదంగంపై సహకరించారు.

తోడి రాగ వర్ణం తో కచేరీ ప్రారంభించి, బేగడ రాగంలో దీక్షితార్ విరచిత వల్లభనాయకస్య, ఉప ప్రధానాంశంగా నాసికాభూషిణి రాగంలో త్యాగరాజ విరచిత మారవైరి, మోహన రాగంలో అరుదైన త్యాగరాజ కృతి ఎందుకో బాగ తెలియదు, శంకరాభరణ రాగంలో శ్యామశాస్త్రి విరచిత సరోజ దళనేత్రి ప్రధానాంశం గా, MD రామనాథన్ గారి రచన అయినఫ సాగరశయన విభో, ఖమాస్ రాగ తిల్లానతో తన కచేరీ ముగించి ఆహుతులను అలరించారు కుమారి ప్రణతి..

# దేవరాపల్లి లో శ్రీమతి కేశిరాజు శారదాదేవి సంగీతసభ







ది.19.3.2023న ఉమారామలింగేశ్వర స్వామి మరియు వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శంకరవిజయేంద్రసరస్వతీ స్వామి వారి అనుగ్రహభాషణ సందర్భంగా విదుషి శ్రీమతి కేశిరాజు శారదాదేవి మరియు వారి శిష్యబృందం గాత్రసంగీత సభ జరిగింది.శ్రీ స్వామి వారు ఆశీస్సులు అందజేశారు. శ్రీ కొక్కొండ సుబ్బరాయన్ వైలన్ పై శ్రీ కృష్ణమూర్తిగారు మృదంగంపై సహకరించారు.

సంగీత కార్యక్రమం అనంతరం కుమారి హరిప్రియ నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమాలు,హోమ పూజాదికాలు యథా సంప్రదాయం జరిగాయి.

# సద్గురు సన్నిధి, రాజమహేంద్రవరం.




వారి.. నెలవారి కార్యక్రమంలో భాగంగా ది.5.3.2023న విద్వాన్ మల్లాది నరసింహారావు, కాకినాడ వారి గాత్ర సంగీత సభ అలరించింది. కంచి స్వామివారి శ్లోకం తో శుభారంభంచేసి సావేరి వర్ణం సరసుడా; వాతాపిగణపతిం; నాదవరాంగిణి రాగంలో కృపాలవాల; బిలహరిలో తొలిజన్మమున; గానమూర్తే; కల్యాణి ప్రధానాంశంగా 'గతినీవే 'కీర్తన కాపి లో చరణములే; సింధుభైరవిలో చంద్రశేఖర యతీంద్రం; బాలమురళీకృష్ణగారి తాయరాగమాలిక తదితర అంశాలు వినిపించారు. పురాణం గణపతిరావు, సరస్వతుల హనుమంతరావు గారల సహకారం రక్తికి దోహదించింది. రెండవ కార్యక్రమంలో శ్రీమతి అజ్జరపు సాహితి భరతనాట్య ప్రదర్శన తో ఆకట్టుకున్నారు. కళాకారులనుశ్రీ నాగరాజు లలిత దంపతులు సత్కరించారు.నిర్వాహకులు శ్రీ శిష్టు మధుసూదన్ మరియు కుటుంబ సభ్యులు, కార్యవర్గం కార్యక్రమం విజయవంతంగానిర్వహించారు.

# సంగీత లహరి, రాజమహేంద్రవరం



సంగీత లహరి, రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో 25.2.2023 న నెలవారీ కార్యక్రమంలో భాగంగా కుమారి కొమ్మాజోస్యుల ఆలేఖ గాత్రకచేరి ప్రతిభావంతంగా జరిగింది. కమాస్ రాగ పదవర్ణంతో ప్రారంభించి, తర్వాత నాట రాగంలో "స్వామినాథ పరిపాలయ" అనే కీర్తన స్వర ప్రస్తారం చేసి రక్తి కట్టించారు. అనంతరం మోక్షము గలదా, మనవి అలకించరాదటె కీర్తనలు ఎంతో ఆర్తి గా పాడి శ్రోతల మన్ననలు పొందారు. ముఖ్యాంశం గా అభేరి రాగం ఆలపించి అందులో "భజరే రే మానస" కీర్తన , స్వరప్రస్తారం ఎంతో విద్వత్తు తో వినిపించారు. తర్వాత బ్రూహి ముకుందేతి , ఫరజ్ రాగ తిల్లాన రక్తి కట్టాయి. చక్కటి గాత్ర ధర్మం , ప్రతిభ గలిగిన వీరికి మంచి భవిష్యత్తు గలగాలని పలువురు దీవించారు.

వయొలిన్ పై శ్రీ సరస్వతుల పార్థివ చాలా చక్కగా సహకరించారు. రాగ అలాపనలో గాత్రానికి సహకరిస్తూ, తన ప్రతిభను ప్రదర్శిస్తూ శ్రోతల మన్ననలు పొందారు.

మృదంగం పై ఆలేఖ తండ్రి మరియు ప్రఖ్యాత మృదంగ విద్వాంసులు శ్రీ సద్గురు చరణ్ సహకరించారు. కచేరీని రక్తి కట్టించడం లో వీరు సిద్ధ హస్తులు. వీరు వాయించిన తని చాలా మంచి ప్రస్తారాలతో విద్వత్తు గా ఉంది. ఘటం పై శ్రీ సరస్వతుల హనుమంతరావు సహకరించారు. వీరు సద్గురు చరణ్ గారితో కలిపి వాయించిన తని శ్రోతల మన్ననలు పొందింది.. యువ కళాకారిణి కచేరి ఏర్పాటు చేసినందుకు శ్రోతలు సభానిర్వాహకులను అభినందించారు.

## ఉగాది కవితా మహోత్సవం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో నాదస్వర విద్వాంసుడు పతకమూరి సాంబయ్య గారికి జరిగిన సన్మాన దృశ్యం.



కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వాయిద్య కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుంటూరు సత్యనారాయణ రాష్ట్ర అధ్యక్షుడు. మాచవరపు రామాంజనేయులు ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి మద్దూలూరి శ్రీనివాసులు కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ పాల్గొనడం జరిగింది.

# శ్రీరామసమాజం, కాకినాడ



శ్రీరామసమాజం, కాకినాడ వారి ఉచిత సంగీత పాఠశాల లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా, సంగీత సేవానిరత శ్రీమునుగంటి శ్రీరామమూర్తి జయంతి సందర్భంగా ను శ్రీ ఎన్.శ్రీనివాస్ –క్లారినెట్ వాద్యకచేరి శ్రీ ఎ.అనిల్ కుమార్ మృదంగసహకారంతో జరిగింది.ఈ సందర్భంగా నాట్యాచారిణి శ్రీమతి సౌమ్య ఆధ్వర్యంలో పర్ణిక నాట్యాలయ విద్యార్థులు నాట్య నివేదన లో పలు అంశాలు ప్రదర్శించారు.

# శరణ్య సంగీత పాఠశాల, కాకినాడ



శ్రీ శ్రీ శ్రీ రంగరామానుజ జియ్యర్ స్వామివారి ఆధ్వర్యంలో కాకినాడ లో నిర్వహింపబడుతున్న శరణ్య ఫైన్ ఆర్ట్స్ పాఠశాల యందు ది.28.3.2023న స్థానిక కళాకారులచే త్యాగరాజ ఆరాధన లో పంచరత్నకృతుల బృందగానం జరిగింది.ఇందులో శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు, శ్రీమతులు పెద్దాడ సూర్యకుమారి, చిలుకూరి సుబ్బలక్ష్మి, ప్రభల రాజేశ్వరి,వింజమూరిగాయత్రి పభృతులు, శరణ్య సంగీత పాఠశాలవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. శ్రీ శ్రీ రంగరామానుజ జియ్యర్ స్వామి అనుగ్రహభాషణంలో సంగీత వైశిష్ట్యం తెలియజేస్తూ వాగ్గేయకారుల గొప్పదనాన్ని వివరించి సర్వులు సంగీతాభిలాషులు కావాలని ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్, శ్రీభైరవభట్ల సుబ్రహ్మణ్య శర్మ వేణువుపై, మహేంద్రవాడ నరసింహమూర్తి వయొలిన్ పై, కె.సూరిబాబు మృదంగంపై సహకరించారు.

# అయోధ్య లో శ్రీరామనవమి సందర్భంగా 'స్వరరాగసుధ' సంగీత కచేరీలు

అయోధ్యలో శ్రీరామనవమి సందర్భంగా స్వరరాగసుధ నిర్వాహకులు విద్వాన్ శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి (కాకినాడ) మరియు వారి శిష్యులు 40 మంది కచేరీలు 30.3.2023 నుండి మూడు రోజులపాటు జరిగి విశేష ప్రాచుర్యం పొందాయి. సర్వశ్రీ వై.భీమశంకర్(వరంగల్లు), చి॥ ఏడిద రవితేజ, మృదంగాలపై; శ్రీ. హేమంత కుమార్ వైలన్ పై సహకరించారు. విష్ణుభట్ల వారికి గానకళ అభినందనలు తెలియచేస్తున్నది.











శ్రీరామసమాజం, కాకినాడ లో శ్రీరామనవమి సందర్భంగా 30-03-2023న పర్ణిక నాట్యాలయ విద్యార్థుల నాట్య నివేదన

# ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు




ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి వారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు దీనికి అనుబంధం గా టి.టి.డి. దాస సాహిత్య ప్రాజెక్టు వారు నిర్వహించిన భక్తి సంగీతం లో భాగంగా ది.08-04-2023 సాయింత్రం 5:30 గం నుండి 7:00 గం వరకు శ్రీమతి డా॥ ఎర్రమిల్లి రమాప్రభ గారి గాత్ర కచేరి ఆద్యంతం శ్రోతలను అలరించింది... కర్ణాటక హరిదాసుల అయిన శ్రీ పురందరదాసు, శ్రీ కనకదాసు వాగ్గేయ కారుల రచనలతో పాటు ఈ ఒంటిమిట్ట రామచంద్ర మూర్తి పై శ్రీ వాసుదాసు వాగ్గేయకారులు రచించిన రచనలను డా॥ రమాప్రభ గారు ఎంతో మధురంగా స్వరపరచి గానం చేయడాన్ని ప్రత్యేకంగా దేవస్థానం అధికారులు అభినందించారు. మరియు వివిధ సంగీత వాగ్గేయకారుల రచనలు ఎంతో భక్తిగా గానం చేశారు.. వీరిని దేవస్థానం వారుస్వామి వారి తీర్థ ప్రసాదాలతో ఆశీర్వదించి వీరి గాన మాధుర్యాన్ని ఎంతో అభినందించారు..

వీరికి వాద్య సహకారంగా శ్రీ యం.కె. జగదీశ్ కీబోర్డ్ పై శ్రీ యం.కె. సోమశేఖర్ తబలా పై అందించారు...

# నివాళి



## "వివిధజంత్ర ప్రవీణ" ఈయుణ్ణి శ్రీకృష్ణ నిధనం.

**కాకినాడ లో ప్రముఖ సేవాసంస్థ సత్కళావాహిని నిర్వాహకులు శ్రీమాన్ ఇ.వి.కృష్ణమాచార్యులు-శ్రీమతి కుంజికా లక్ష్మి కుమారులు మృదంగ,ఘటవాద్య విశారదులు,అనేక ఇతర సంగీత వాద్య నిపుణులు ,మంజరీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఈయుణ్ణి శ్రీకృష్ణ తన 36 వ ఏట స్వల్ప అస్వస్థత తో ది.30.3.2023 న కాకినాడ లో పరమపదించారు. వీరు అనేక చిత్రాలకు ఆర్కెస్ట్రాలో సహకరించారు కూడా!ఆస్కార్ పొందిన ఆర్.ఆర్.ఆర్ చిత్రానికి కూడా పనిచేశారు. ప్రఖ్యాతులైన సంగీత దర్శకులకు అభిమాన పాత్రులు. వీరి మరణం సంగీత లోకానికి తీరని వ్యథను మిగిల్చింది. వీరికి భార్య ఇద్దరు కుమారులు. గానకళ వీరి మరణానికి సంతాపాన్ని తెలియచేస్తున్నది.**

# శాస్త్రీయ సంగీతంపై వర్క్ షాపు



విమల కృష్ణ మ్యూజిక్ అకాడమి చైర్మన్ డాక్టర్ మండపాక శారద ఆధ్వర్యాన స్థానిక పౌరగ్రంథాలయంలో శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్ షాప్ ప్రారంభమైంది. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ద్వారం త్యాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన తండ్రి, ప్రముఖ సంగీత విద్వాంసులు అయిన ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ, ఆదివారం కూడా వర్క్ షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా ద్వారం భావనారాయణ, ద్వారం త్యాగరాజుల విశిష్టతను, గొప్పతనాన్ని సభికులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ ఎకాడమీ కార్యదర్శి శ్రీ యం.యస్. శ్రీనివాస్ పాల్గొని డా॥ ద్వారం త్యాగరాజును సన్మానించారు. పలువురు సంగీత కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.







## ఆదిత్య సంగీత సంస్థ

చెన్నైలో కుమారి వైజర్స్ ప్రణతి గాత్ర సంగీత సభ 25.2.2023న ప్రతిభావంతంగా జరిగింది. సతీష్ శేషాద్రి వయోలిన్ పై, సతీష్ మృదంగం పై సహకరించారు.

పట్నంవారి తోడివర్ణం తో ఆరంభించి బేగడలో వల్లభనాయకస్య; మారవైరి రమణి తిశ్రగతిఆదితాళం– నాసికాభూషణి అంశం ఉప ప్రధానాంశంగా వినిపించి, ఎందుకో బాగా తెలియదు– మోహన రాగ త్యాగరాజ కృతి అనంతరం శంకరాభరణంలో ఖండగతి ఆదితాళంలో రాగంతానం పల్లవి సమర్థంగా అందించి మెప్పు పొందారు. మధ్యమావతిలో కర్పగమే అంశంతో కార్యక్రమం విజయవంతమైంది.




కార్తికేయ గానసభ హైదరాబాదులో
శ్రీ దుడ్డు సీతారామయ్య వీణ కచేరి.





సత్కళావాహిని 52 వ వార్షికోత్సవాలలో సంగీత,
నాటక, నాట్య, బహుకళారంగ ప్రఖ్యాతులు
శ్రీ కూచి భాస్కరరామం దంపతులకు సత్కారం.



ద్వారంలక్ష్మీ ఎకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్
సంస్థ లో సత్కరింపబడిన స్వరరాగసుధ నిర్వాహకులు
విద్వాన్ శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి.

# నాదవిపంచి - నార్త్ కరోలినా





పై సంస్థ ఆధ్వర్యంలో కేరి నగరంలో జరిగిన "వాగ్గేయకారవైభవం" కార్యక్రమంలో శ్రీమతులు మంద విజయకుమారి(కాకినాడ), కమ్మనడిమింటి మల్లిక, కుమారి నాగవిజయలహరి, సుదర్శన్ మోహన్, శ్రేయస్ అశోక్, శ్రీరామ్ వెంకట్ మొదలైనవారు గానంచేయగా శ్రీకాంత్ నారాయణ్ మృదంగంపై సహకరించారు. తోడిరాగ అంశం ఆరగింపవే; వదనద్యుతి జితసోమ–పంతువరాళి; మంగళమవనిసుత నాథునికి వంటి త్యాగరాజ కృతులు వినిపించారు.

## ట్రయాడ్ హిందూ టెంపుల్-గ్రీన్ బరో-యు.ఎస్.ఏ




18.3.2023న పై దేవాలయ ప్రాంగణంలో 'నాదోపాసన' కార్యక్రమంలో శ్రీమతులు కమ్మనడిమింటి (మంత్రవాది) మల్లిక, మంద విజయకుమారి (కాకినాడ), కుమారి కమ్మనడిమింటి నాగవిజయలహరి గాత్ర సంగీతసభ నిర్వహించారు. శ్రీ తేజస్వి శశిధర్ మృదంగ సహకారం అందించారు.

# సరస్వతీ గానసభ, కాకినాడ










సరస్వతీ గానసభ, కాకినాడ వారి 119 వ వార్షిక ఉత్సవాలలో భాగంగా మూడవ విడత సంగీత కార్యక్రమాలు 2023 మార్చి24,25,26 తేదీలలో వారి స్వంత భవనం సూర్యకళామందిరంలో జరిగాయి.

24న శ్రీ సిక్కిల్ గురుచరణ్ గాత్ర సంగీత సభ కు సర్వశ్రీ ఎమ్.నీలాద్రిరావు, ఎమ్.ఏడుకొండలు,ఎస్.హనుమంతరావులు చక్కని సహకారం అందించారు.

గానసభ అధ్యక్షులు శ్రీ కె.వి.ఎస్. ఆంజనేయమూర్తి సభా ప్రారంభంచేశారు.సభ అందిస్తున్న సేవాకార్యక్రమాలను వివరిస్తూ చి॥కర్నూలు హరీష్ ను హిందుస్థాన్ సంగీత విద్యలో ఉత్తమునిగా తీర్చి దిద్దడానికి సభ అందించిన సహాయసహకారాలను వివరించారు.కార్యదర్శి శ్రీపేపకాయల రామకృష్ణ,శ్రీ చెరుకువాడ సత్యనారాయణ (సి.ఎస్)ఈ కార్యక్రమాల కళాకారుల పరిచయం చేశారు మూడురోజులు.సర్వశ్రీ లక్కరాజు సత్యనారాయణ, కొమ్మిరెడ్డి శ్రీరామనరసింగరావు, శ్రీమతి వి.పద్మ కళాకారులను సత్కరించారు.

25న కుమారి ఎస్.అంజని-చెన్నై వీణ కచేరీకి కుమారి ఎస్.అశ్విని మృదంగంపై,ఎస్. హనుమంతరావు ఘటంపై సహకరించగా రక్తిగా సాగింది.

26న సరస్వతీ గానసభ అనుదానంతో సంగీత విద్యను అభ్యసించిన చి॥కర్నూలు హరీష్ హిందుస్థానీ గాత్రసభకు ఉస్తాద్ నజ్ముద్దీన్ ఖాద్రి తబలాపై,మహమ్మద్ అస్లాంఖాన్ సారంగిపై సహకరించారు.

# విజ్ఞాన సమితి, హైదరాబాద్













విజ్ఞాన సమితి, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత విద్వాంసులు " కళా రత్న" శ్రీ డి. వి.మోహన కృష్ణ గారి పర్యవేక్షణలో 1.4.2023 నుండి 3.4.2023 వరకు "రాగంతానం పల్లవి " శీర్షికన విశేష కార్యక్రమం నిర్వహించారు. గడచిన 25 సంవత్సరాలలో తెలుగునాట మరే వేదిక మీద జరగని ప్రయత్నం ఈ సభా వేదిక ద్వారా జరపటం ఒక ప్రత్యేకత అని విజ్ఞులు పొగిడారు. ఇందులో 1.4న తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్మన్ 'కళారత్న', కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత శ్రీమతి దీపికారెడ్డి జ్యోతిప్రజ్వలనంతో కార్యక్రమాలు శుభారంభం అయ్యాయి. అనంతరం సంగీత విద్వాంసులు కళారత్న శ్రీ పి.వి.శేషయ్యశాస్త్రి, శ్రీమతులు విజయనగరం డి.వర్ధని, డా.ఎస్.ఉమాదేవి, డా.ఎస్.నీతాచంద్రశేఖర్ లు 'రాగంతానంపల్లవి' ఉనికి, విశేషాలు, అనుసరణ, సమర్పణ తదితర అంశాలపై శ్రోతలకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీమతి తులసీ విశ్వనాథ్ "రాగం తానంపల్లవి" ప్రధాన అంశం: – శుద్ధ ధన్యాసి రాగం: ద్వినడ పల్లవి, చతురస్ర జాతి త్రిపుట తాళం. పల్లవి – "భవతరణ వేంకట రమణ నను కాపాడుము "సర్వశ్రీ పి.నందకుమార్, శ్రీ సి.హెచ్.రామకృష్ణ, శ్రీ బి.జనార్ధన్ సహకరించగా ప్రతిభావంతంగా జరిగింది.

2.4 న మొదటి కార్యక్రమంలో శ్రీమతి శ్యామలారవి ద్వినడ పల్లవి – "నిన్నే నెర నమ్మి నానురా నీరజాక్ష" అనే సాహిత్యంతో 'రాగంతానంపల్లవి' సమర్పించారు. రెండవ కార్యక్రమంలో కళారత్న శ్రీ డి.వి.మోహనకృష్ణ గురువు డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారిని తలపిస్తూ సాగిన కచేరీలో ప్రధానాంశం – రాగం తానం పల్లవి – రెండు రాగాల పల్లవి – రెండు రాగాల ఆలాపన, తానం – రాగాలు – కల్యాణ వసంతం, మోహన. పల్లవి – కల్యాణ వసంతుడీ హరి, మోహన మురారి కెవరు సరి. చతురస్ర జాతి త్రిపుట తాళం.







కుమారి వి.ఎస్.పి. గాయత్రిశివాని వైలన్ పై, శ్రీ పి.జయభాస్కర్ మృదంగంపై, శ్రీ కె.శ్యామకుమార్ కంజిరపై సహకరించగా జరిగింది. ముఖ్య అతిథిగా "హైదరాబాద్ సోదరీమణి" శ్రీమతి హరిప్రియ విచ్చేశారు.

3.4 న శ్రీమతి చాగంటి రమ్యకిరణ్మయి మొదటి కార్యక్రమంలో ప్రధానాంశం – రాగం తానం పల్లవి – రెండు రాగాల పల్లవి – కన్నడ, కానడ రాగాలు. చతురశ్ర జాతి త్రిపుట తాళం, మిశ్రగతి పల్లవి – రామా శ్రీరామా కన్నడ వలదయ్య ఇంత పరాకా, నడచి వచ్చి నను బ్రోవవయ్యా 'రాగంతానం'పల్లవి సమర్పించగా రెండవ కార్యక్రమంలో శ్రీమోదుమూడి సుధాకర్ ప్రధానాంశం: రాగం తానం పల్లవి – హంసానంది రాగం లో "రీ" స్వరాన్ని షడ్జమం చేసి గ్రహభేదం కావించి హిందోళం చేశారు. పల్లవి సాహిత్యం – సోహం సానందిని జనని, హిందోళ రాగ మోదిని. ఖండ త్రిపుట తాళం.

శ్రీ ఆర్.దినకర్ వైలన్ పై, శ్రీ కె.సద్గురు చరణ్ మృదంగంపై, శ్రీ ఎమ్. చంద్రకాంత్ ఘటంపై సహకరించారు.




ఈ కార్యక్రమ ముఖ్య అతిథి శాంత బయొటెక్స్ అధినేత పద్మభూషణ్ డా.కె.ఐ.వరప్రసాద రెడ్డి గారు. పన్నాలాల్ బన్సీలాల్ పిట్టి కల్యాణ పండపం, ఆనంద నగర్, ఖైరతాబాద్ వేదికగా ఈ కార్యక్రమాలు జరిగాయి.

కార్యదర్శి శ్రీ వి.వి. సుజ్ఞాన్ స్వాగతం పలుకుతూ సభ నిర్వహిస్తున్న విశేషాలను వివరించారు. అధ్యక్షులు శ్రీ సూరి వెంకటేశ్వర్లు సభాధ్యక్షత వహిస్తూ సహకరిస్తున్న వదాన్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మూడు రోజులూ ఒక పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమాలకు విశేషంగా సంగీతాభిమానులు వచ్చి ఇటువంటి ప్రత్యేక అంశాలను ఎంతగా ఆదరిస్తారో తెలియజేశారు. ఈ కార్యక్రమాలు hope ad tv ప్రత్యక్ష ప్రసారం ద్వారా దూర ప్రాంతాల వారు, ఇతర రాష్ట్రాలలో, దేశాలలో ఉన్న అనేక సంగీత రసికులు వీక్షించి వారి సంతోషాన్ని కార్యకర్తలకు తెలియ చేసారు.




ఉగాది సందర్భంగ 22.3.2023న విజ్ఞానసమితి, హైదరాబాద్ వారు శ్రీమతులు అరుణ పద్మల గాత్ర సంగీత సభ ఏర్పాటు చేశారు. వీరికి ఓ. రాజశేఖర్ వైలన్ పై, డా.డి.ఎస్.ఆర్.మూర్తి మృదంగంపై,బి.జనార్ధన్ ఘటంపై సహకరించారు.

# నివాళి



## యువ మృదంగ వాదకుని అకాలమరణం

మార్చి 24 2023 సంగీత లోకానికి తీరని విషాదం మిగిల్చింది. అత్యంత ప్రతిభ గలవాడు మిత భాషి, మృదుభాషి. మొహంపై చెరగని చిరునవ్వుగలవాడు. పెద్దలంటే మర్యాద, మన్నన హృదయం లోనించి వచ్చే గుణం కల ఎంతో ప్రతిభ గల కళాకారుడు శ్రీ కర్రా శ్రీనివాసు కారు ప్రమాదంలో మన నుండి దూరమయ్యారు. సంగీతలోకానికి, ఆప్తులకు, కుటుంబానికి తీరని వ్యధ మిగిల్చి పరమపదంచేరారు. వారిమరణానికి గానకళా లోకం తరపున సంతాపం తెలియ జేస్తు న్నాము. **- సంపాదకుడు.**

శ్రీ కర్రా శ్రీనివాస్ గురుకుల పాఠశాలలో మృదంగం అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. శ్రీ శ్రీనివాస్ వివాహితుడు. భార్య శ్రీమతి వీణాధరి, ఇద్దరు చిన్న ఆడపిల్లల తండ్రి.ఆమె కూడా మృదంగ విద్వాంసురాలే.

ప్రసార మాధ్యమాలలో శ్రీ శ్రీనివాస్ "A" గ్రేడ్ విద్వాంసుడు. ప్రఖ్యాత మృదంగ విద్వాంసుడు శ్రీ కారైక్కుడి మణి శిష్యుడు. తండ్రి శ్రీ కర్రా సుబ్రహ్మణ్యం దశాబ్దాలుగా పేరుపొందిన మృదంగం విద్వాంసులు.శ్రీనివాస్ కు ప్రథమ గురువు. అటు తరువాత ప్రఖ్యాతులు శ్రీ కొలంక లక్ష్మణ రావు గారు, శ్రీ మహాదేవు సుబ్బరాజు గారు. ప్రస్తుతం శ్రీ కారైక్కుడి మణి గారి దగ్గర శిష్యరికం చేస్తున్నారు.

శ్రీ శ్రీనివాస్ శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం నుండి మృదంగ వాదనలో M.A, M.Phil పట్టా పొందారు. ప్రఖ్యాత నర్తకీ మణుల బృందంలో సభ్యుడుగా 18 దేశాలలో 25 సంవత్సరాలకు పైగా నట్టువాంగం చెప్పిన అనుభవం.

ఎంతో మంది ప్రఖ్యాత సంగీత విద్వాంసుల కచేరీలలో మృదంగం వాదకుడుగా పాల్గొని వారి అభిమానమూ, ఆశీస్సులూ పొందిన భాగ్యశాలి.

సింఫనీ, జుగల్‌బంది లలో పాల్గొన్నారు. మదరాసు మ్యూజిక్ అకాడమీ వారిచే ఉత్తమ మృదంగ వాదకునిగా పురస్కారం పొందిన వారు.

జంట నగరాలలోని సంగీత విద్వాంసులే గాక దక్షిణ దేశం లోని ఎంతో మంది శ్రీ శ్రీనివాస్ అకాల మరణంపట్ల దిగ్భ్రాంతినీ, సంతాపాన్ని సందేశాల రూపంలో ప్రకటించారు. శ్రీ శ్రీనివాస్ తండ్రి గారు శ్రీ సుబ్రహ్మణ్యం గారికి, అతని భార్యా పిల్లలకు ఇతర కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సంతాపము సానుభూతి.

**ఓరుగంటి ఆనంద మోహన్**

సంగీత క్షీర సాగరం హైదరాబాద్ నిర్వాహకులు.





గాయత్రీ మహిళా సంగీతసమ్మండలి, గుంటూరు
26వ వార్షిక సావనీర్ ను విడుదల చేస్తున్న
శ్రీ అన్నవరపు రామస్వామి ప్రభృతులు.



విశాఖ మ్యూజిక్ అకాడమీ-విశాఖలో భక్తజ్ఞానానందతీర్థ
ఓగిరాల వీరరాఘవశర్మ స్మారక అవార్డును అందుకున్న
విదుషి శ్రీమతి తులసీ విశ్వనాథ్.




12.3.2023న గుంటూరు గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి
వారినుండి స్వర్ణపతకాన్ని అందుకొన్న వర్ధిష్ణు మృదంగ
విద్వాంసుడు చి॥ సాయికేశవ సబేశన్. ఇతను ప్రఖ్యాత
మార్దంగికులు శ్రీ వంకాయల వెంకటరమణ మూర్తి గారి
శిష్యుడు.



అంతర్జాతీయ మహిళాదినోత్సవ సందర్భంగా వారి సంఘ
సేవలకు సత్కరింపబడిన శ్రీమతి పాటిబండ లలితాదేవి.
(గాయత్రీ మహిళాసంగీత సమ్మండలి సహకార్యదర్శిని).




శ్రీరామగానసభ 54వ త్యాగరాజ ఉత్సవాలలో
పంచరత్న బృందగానదృశ్యం.



14.3.2023 న విజయవాడ ప్రసన్న ఆంజనేయస్వామి
దేవస్థానం లో సంగీత కచేరీ సందర్భంగా సత్కరింపబడిన
సీనియర్ సంగీత విద్వాంసులు శ్రీ కె.వి.బ్రహ్మానందం.

Editor & Publisher : Ganakala, M.Venkatarao 30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, **Cell, 9441488721**
Printed at : Padmanabha Offset Printers, Nageswara Rao Street, Ramaraopeta, Kakinada - 4, Cell : 9246691016